మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 156 | శుక్రవారం | 28 - 11 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తేవాలి



3లో..




## ఆధార్ ఉన్నంత మాత్రాన ఓటు హక్కు ఇవ్వాలా?

**చొరబాటుదారుల ఆధార్ కార్డులపై న్యాయస్థానం ఆందోళన**
**పౌరసత్వ రుజువు కాదని ఆధార్ చట్టంపై బెంచ్ స్పష్టం**

మన గళం, న్యూఢిల్లీ : చొరబాటుదారులు ఆధార్ కార్డు పొందటం, దాని ఆధారంగా ఓటరు హక్కు పొందే పరిస్థితిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. "ఆధార్ ఉండటం వల్లే ఎవరినైనా ఈ దేశపు పౌరుడిగా గుర్తించాలా? పౌరసత్వ ప్రమాణానికి ఆధార్ ప్రమాణం ఎలా అవుతుంది?" అని బెంచ్ ప్రశ్నించింది. సంక్షేమ పథకాల సరఫరా కోసం మాత్రమే అధార్ ఉపయోగపడుతుందని, పౌరసత్వానికి ఇది

2 లో..

## స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రారంభం



**- విక్రమ్-1 ఆవిష్కరణతో అంతరిక్ష రంగంలో భారత్ కొత్త దిశలోకి : ప్రధాని మోదీ**

మన గళం, హైదరాబాద్ : హైదరాబాద్ రావిర్యాలలో అత్యాధునికంగా నిర్మించిన స్కైరూట్ ఏరోస్పేస్ "ఇన్ఫినిటీ క్యాంపస్"ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశపు తొలి ప్రైవేట్ కమర్షియల్ లాంచ్ వాహనం 'విక్రమ్-1'

2 లో..

## దేశవ్యాప్తంగా ఆధార్ డాటా క్లీన్-అప్

**చనిపోయిన 2 కోట్ల మంది ఆధార్‌లను డీయాక్టివేట్ చేసిన ఉడాయ్**




మన గళం, న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఆధార్ డాటాబేస్‌ను శుద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన క్లీన్-అప్ ఆపరేషన్‌లో భాగంగా భారీ స్థాయిలో ఆధార్ నంబర్ల నిర్ధరణ, ధృవీకరణ జరిగింది. ఇందులో భాగంగా చనిపోయిన 2 కోట్ల మందికిపైగా ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసినట్టు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికారిక సంస్థ -ఉడాయ్) వెల్లడించింది. ఆధార్ డేటాలో ఉన్న లోపాలు, పాత రికార్డులు, ఉపయోగం లేని నంబర్లు తొలగించడం ద్వారా వ్యవస్థను మరింత పారదర్శకంగా, సురక్షితంగా మార్చడం ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఉడాయ్ తెలిపిన వివరాల ప్రకారం, అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన రికార్డులు, జనన-మరణ

2 లో..

# అమరావతిలో రెండో ప్రాకారం భూమిపూజ

- తిరుమల తరహాలో శ్రీవారి ఆలయం నిర్మాణం ప్రారంభం
- సీఎం చంద్రబాబు చేతులమీదుగా శంకుస్థాపన
- అమరావతిని 'దేవతల రాజధాని'లా తీర్చిదిద్దే సంకల్పం
- కృష్ణానది ఒడ్డున శ్రీవారి క్షేత్రంగా రాజధాని అభివృద్ధి



మన గళం, అమరావతి : అమరావతి రాజధానిలో వెంకటపాలెం వద్ద నిర్మాణం జరుగు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రెండో ప్రాకారం అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. యాగశాలలో జరిగిన పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం, అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య భూమిపూజ చేసి ద్వితీయ మహాప్రాకారం, చతుర్ద్వార గోపురాలు, అనుసంధాన అభివృద్ధి పనులకు పునాది రాయి వేశారు. అమరావతిలో తిరుమల మహక్షేత్రాన్ని ప్రతిబింబించేలా ఈ ఆలయం రూపుదిద్దుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతిని "దేవతల రాజధాని"లా తీర్చిదిద్దాలనే సంకల్పంతోనే ఈ అభివృద్ధి పనులను ప్రారంభించామని తెలిపారు. కృష్ణానది తీరంలో శ్రీ వేంకటేశ్వర స్వామిని ప్రతిష్ఠించడం రాష్ట్రానికి ఆధ్యాత్మిక శక్తిని అందిస్తుందని చెప్పారు. "తిరుమలలో ఉన్న మహిమ, శాంతి, ఆధ్యాత్మిక తరంగాలు ఇక్కడ కూడా ప్రవహించేలా నిర్మాణం జరుగుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో చేసిన మంచి-చెడుల ఫలితాలను ఈ జన్మలోనే మనిషి చూస్తున్నాడని, శ్రీవారు తనపై ఎన్నోసార్లు కరుణ చూపిన సందర్భాలను ఆయన గుర్తుచేశారు. భక్తులతో కలిసి సాధారణ భక్తుడిగా శ్రీవారిని సేవించాలనే మనసుతోనే ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు సీఎం పేర్కొన్నారు. నక్సలైట్లు గతంలో 23 క్లెమోర్ బాంబులు పెట్టినా శ్రీవారు తనను రక్షించారని వెల్లడించారు. ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, సంపద,



సంతోషం కలిగించే పాలన అందించడమే తన ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు తెలి పారు. అమరావతిలో నిర్మాణం జరుగు ఈ శ్రీవారి ఆలయం రాష్ట్ర ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి కేంద్ర బిందు వుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, కేంద్ర మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి. నారాయణ, నాదెండ్ల మనోహర్, టీటీడీ బోర్డు సభ్యులు, అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరి, జేఈవోతో పాటు అనేక మంది భక్తులు పాల్గొన్నారు. తిరుమలకు సమానమైన ఆధ్యాత్మిక వాతావరణం అమరావతిలో నెలకొనే దిశగా ఈ ప్రారంభ పనులు కీలకంగా భావిస్తున్నారు.




## మంగళగిరిలో అభివృద్ధి కార్యక్రమాల్లో లోకేష్

మన గళం, మంగళగిరి : మంగళగిరి పట్టణంలో పలు అభివృద్ధి పనులు వేగవంతమవుతున్న నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ గురువారం అనేక శుభారంభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని రాజీవ్ సెంటర్‌లో బిట్ర తులసీ రామ్, అందె వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్యభామ సిల్క్స్ హ్యాండ్‌లూమ్స్ నూతన షోరూమ్‌ను లోకేష్ ప్రారంభించారు. స్థానిక వ్యాపార అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఇలాంటి సంస్థలు ముందుకు రావడం ఆనందదాయకమని ఆయన పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన లోకేష్, మంగళగిరి పట్టణం చేనేత సిల్క్ రంగంలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి, దీన్ని రాష్ట్రస్థాయి వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలు భారీగా ఉన్నాయని తెలిపారు. స్థానిక వ్యాపారులకు ప్రోత్సాహకాలు, మార్కెట్ అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి మద్దతు

2 లో..

## తిరుమల కల్తీ నెయ్యి కేసులో కీలక పరిణామం



మన గళం, తిరుమల : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), టీటీడీ కొనుగోలు విభాగం జనరల్ మేనేజర్ కె. సుబ్రహ్మణ్యంను గురువారం అరెస్ట్ చేసింది. ఇంతకుముందు ఈ కేసులో కాంట్రాక్టర్లు, వ్యాపారులు అరెస్టైనప్పటికీ, టీటీడీ ఉన్నతాధికారిని అదుపులోకి తీసుకోవడం ఇదే తొలి ఘటన. ఈ అరెస్టుతో కేసులో నిందితుల సంఖ్య 10కి చేరింది. సిట్ విచారణలో, నెయ్యి సరఫరా కాంట్రాక్టులలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు స్పష్టమైంది. సుబ్రహ్మణ్యం

2 లో..




## శ్రీకాకుళం నేతన్నల సమస్యలపై సంయుక్త సమీక్ష

**మంత్రి అచ్చన్నాయుడు, సవిత నేతృత్వంలో సమావేశం**

మన గళం, అమరావతి : శ్రీకాకుళం జిల్లాలోని చేనేత సొసైటీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర సచివాలయంలో చేనేత శాఖ మంత్రి ఎస్. సవిత మరియు రాష్ట్ర మంత్రి కింజరపు అచ్చన్నాయుడు కలిసి నేతన్నల బృందంతో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇద్దరు మంత్రులు ఒకే

2 లో..

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన కేంద్ర బృందం




మనగళం, నంద్యాల : కుష్ఠ వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే పర్యవేక్షణ లో భాగంగా గురువారం కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ శాంతారాం, డాక్టర్ రీతి తివారి, డాక్టర్ దేవ సాగర్, సత్యవతి, డాక్టర్ యన్. కాంతా రావు నాయక్, తేజస్విని తదితరులు శ్రీశైలం, ట్టైర్లూటి, బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. రికార్డ్స్, రిజిస్టర్స్ తనిఖీ చేశారు. సర్వే జరిగిన విధానాన్ని, అనుమానిత కుష్ఠ వ్యాధిగ్రస్తులను, రికార్డులను పరిశీలించిన బృందం సభ్యులు క్షేత్ర సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డీఎంహెచ్ ఓ డాక్టర్ ఆర్ కటరమణతో కేంద్ర బృందం సభ్యులు సమావేశమ య్యారు. అనుమానిత కేసులను ప్రాథమిక ఆరోగ్య

2 లో..

## ఆధార్ ఉన్నంత మాత్రాన
# ఓటు హక్కు ఇవ్వాలా?

ఎటువంటి నిర్ధారణ పత్రం కాదని స్పష్టంగా వెల్లడించింది. ఇందులో భాగంగా ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రస్తుతం కీలక పిటిషన్లను విచారిస్తోంది. ఎన్నికల కమిషన్ పలు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టాలనే నిర్ణయాన్ని సవాలు చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రత్యేకించి తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈ రివిజన్ పనితీరుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేయడంలో ఆధార్‌ను ప్రధాన ఆధారంగా పరిగణించడం ఎంతవరకు సరైనదో ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను వివరణ కోరింది. “అధార్ చట్టం పౌరసత్వం ఇవ్వదు, నివాస ప్రామాణికతను కూడా నిర్ధారించదు” అని బెంచ్ స్పష్టం చేసింది. ఓటు హక్కును తొలగించే ముందు నోటీసు ఇవ్వాలని కోర్టు స్పష్టమైన సూచనలు చేసింది. ఓటరు జాబితాలో పేరు నమోదు లేదా తొలగింపులో ప్రతీ నిర్ణయం, దరఖాస్తుదారు సమర్పించిన దస్తావేజుల ఆధారంగా ఎన్నికల కమిషన్ తీసుకోవాల్సిందేనని పేర్కొంది. “ఎలక్షన్ కమిషన్ పోస్టాఫీసు కాదు%ౌ% దరఖాస్తు వచ్చినంత మాత్రాన ఒప్పుకుని పంపేది కాదు” అని బెంచ్ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఓటరు పరిష్కారాల్లో సరైన ధృవీకరణ ప్రక్రియ తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ వివాదంపై మరింత లోతైన విచారణ జరపడానికి సుప్రీంకోర్టు ప్రత్యేక షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. డిసెంబర్ 1లోపు ఎన్నికల కమిషన్ ప్రతిస్పందనలు దాఖలు చేయాలని ఆదేశించింది. పిటిషనర్లు తమ అభ్యంతరాలను, ఆధార్%-%ఓటరు నమోదు వ్యవస్థలో ఉన్న లోపాలను పూర్తి వివరాలతో సమర్పించవచ్చని తెలిపింది. ఈ అంశాలపై త్వరలోనే మరింత విస్తృత వాదనలు వినిపించనున్నట్లు బెంచ్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఓటు హక్కు ధృవీకరణ ప్రోటోకాల్‌లో మార్పులకు దారితీసే అవకాశం ఉన్న ఈ విచారణపై దృష్టి నిలిచింది.

# మంగళగిరిలో అభివృద్ధి కార్యక్రమాల్లో లోకేష్

ఇవ్వడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. హ్యాండ్‌లూమ్ రంగం అభివృద్ధి చెందితే వందల్లో కుటుంబాలకు ఉపాధి కలుగుతుందని ఆయన గుర్తుచేశారు. సత్యభామ సిల్క్స్ ద్వారా స్థానిక నెయ్యదారులకు, నేతన్నలకు, చిన్న వ్యాపారులకు మరింత మార్కెట్ అవకాశాలు సిద్ధమవుతాయని లోకేష్ అభిప్రాయపడ్డారు. నాణ్యతతో కూడిన హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను అందించడం ద్వారా మంగళగిరి సిల్క్ హ్యాండ్‌క్రాఫ్ట్ బ్రాండ్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా షోరూమ్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందిస్తూ, మంచి నాణ్యతను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంగళగిరిలో చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులు, రోడ్ల విస్తరణ, వాణిజ్య సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై లోకేష్ ప్రజలతో మాట్లాడారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆధునికంగా, వ్యాపార స్నేహపూర్వకంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.



# తిరుమల కల్తీ నెయ్యి కేసులో కీలక పరిణామం

కొనుగోలు ప్రక్రియలో నిబంధనలను ఉల్లంఘించడం, నాణ్యత లేని నెయ్యి సరఫరాకు సహకరించడం వంటి కీలక ఆరోపణలు విచారణలో తేలినట్లు తెలుస్తోంది. గతంలో అరెస్టయిన కాంట్రాక్టర్ల వాంగ్మూలాల్లో బయటపడ్డ వివరాలు సుబ్రహ్మణ్యం పాత్రను బలపరిచాయని అధికారులు పేర్కొన్నారు. లడ్డూలో ఉపయోగించే నెయ్యి నాణ్యతపై వచ్చిన భారీ విమర్శల తరువాత ఈ కేసు రాష్ట్రమంతా చర్చనీయాంశంగా మారింది. అరెస్టు అనంతరం సుబ్రహ్మణ్యంను తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. తదుపరి చట్టప్రక్రియల్లో భాగంగా ఆయనను నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించే అవకాశం ఉందని సిట్ వర్గాలు భావిస్తున్నాయి. టీటీడీ అంతర్గత వ్యవస్థలోకి దర్యాప్తు మొదటిసారిగా విస్తరించడం ఈ కేసు మరింత లోతుకు చేరుతోందని అధికారులు పేర్కొన్నారు. భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసంతో ముడిపడి ఉన్న తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యతపై ప్రశ్నలు లేవడంతో మొదలైన ఈ దర్యాప్తు ఏపీ హైకోర్టు ఆదేశాల తర్వాత వేగం పుంజుకుంది. తరువాత సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ సాగుతుండటం కేసుకు జాతీయ ప్రాధాన్యతను తెచ్చింది. నెయ్యి సరఫరా వ్యవస్థలో మరిన్ని అవకతవకలు వెలుగులోకి రావచ్చని విచారణాధికారులు సూచిస్తున్నారు.

## స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రారంభం

రాకెట్‌ను ఆవిష్కరించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ స్పేస్ సదుపాయంగా నిలిచే ఈ క్యాంపస్‌ను అభినందించిన ప్రధాని, భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీకగా నిలుస్తుందని ప్రశంసించారు. “సైకిల్‌పై రాకెట్ భాగాలు మోసుకెళ్లిన రోజుల నుండి ఈ స్థాయికి చేరడం భారత్ ప్రగతికి నిదర్శనం” అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రధాని మాట్లాడుతూ, భారత అంతరిక్ష రంగం దిశ మార్చుకున్న మలుపుల్లో ఇది ఒక ముఖ్యమైన ఘట్టమని చెప్పారు. స్టార్టప్‌లకు ఇచ్చిన అవకాశాలు, నియంత్రణా సంస్కరణలు, కోఆపరేటివ్ ఎకోసిస్టమ్ ఏర్పాటుతోనే ఈ రోజు ఇలాంటి స్థాయిలో ప్రైవేట్ స్పేస్ సంస్థలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. వ్యవసాయం, వాతావరణ అధ్యయనం, ఉపగ్రహ కమ్యూనికేషన్, గ్లోబల్ స్పేస్ మార్కెట్ వంటి రంగాల్లో చిన్న శాటిలైట్లకు డిమాండ్ భారీగా పెరుగుతుందని, భారత్ ఈ అవకాశాలకు తగిన విధంగా సిద్ధమైందని ఆయన పేర్కొన్నారు. “జెన్- ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు ప్రపంచానికి తమ ప్రతిభ నిరూపించే సమయం ఇది” అని మోదీ పిలుపునిచ్చారు. స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 రాకెట్ దేశీయ అవసరాలకే కాక విదేశీ శాటిలైట్లను కూడా తక్కువ ఖర్చుతో భూమి కక్ష్యలో ప్రవేశపెట్టగల సామర్థ్యంతో రూపుదిద్దుకుంది. 300 కిలోల వరకు పేలోడ్స్‌ను తీసుకెళ్లగలిగే ఈ రాకెట్ కార్బన్ ఫైబర్ నిర్మాణంతో రూపొందించడం దీని ప్రత్యేకత. ఏ ప్రయోగ కేంద్రం నుంచైనా 24 గంటల్లో అసెంబుల్ చేసి లాంచ్ చేయగలిగే సౌలభ్యం విక్రమ్-1ను గ్లోబల్ లాంచ్ మార్కెట్‌లో పోటీ స్థాయికి తీసుకువెళ్తుందని కంపెనీ వెల్లడించింది. బహుళ శాటిలైట్లను ఒకేసారి కక్ష్యలో ప్రవేశపెట్టగల రచనతో విక్రమ్-1 ప్రపంచ ఉపగ్రహ ప్రయోగ వ్యవస్థకు కొత్త అవకాశాలను తెరచనుంది. స్కైరూట్‌ను మాజీ ఇస్రో శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ ఢాకా స్థాపించారు. 2022లో భారతదేశ తొలి ప్రైవేట్ సబ్-ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-ఎస్ ప్రయోగం ద్వారా చరిత్ర సృష్టించిన స్కైరూట్, ఇప్పుడు కమర్షియల్ లాంచ్ వాహనంలోనూ దేశాన్ని మరో స్థాయికి తీసుకెళ్తోంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. భారత అంతరిక్ష రంగం భవిష్యత్తులో ప్రపంచ అగ్రస్థానంలో నిలుస్తుందన్న నమ్మకాన్ని ఈ ఆవిష్కరణ మరింత బలపరిచింది.

# శ్రీకాకుళం నేతన్నల సమస్యలపై సంయుక్త సమీక్ష

వేదికపై చేనేత రంగ సమస్యలను పరిశీలించడం ఈ భేటీకి మరింత ప్రాధాన్యతను తెచ్చింది. జిల్లా నేతన్నల ప్రతినిధులు ఉత్పత్తి ఖర్చులు పెరుగుదల, సరైన ధరలు రాకపోవడం, మార్కెటింగ్‌లో ఎదురవుతున్న అనిశ్చితి, మధ్యవర్తుల ప్రభావం వంటి అంశాలను ఇద్దరు మంత్రుల ముందుకు వివరించారు. నేతన్నల నుంచి వచ్చిన ప్రతి సమస్యను అచ్చన్నాయుడు-సవిత సంయుక్తంగా నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అంశాల జాబితా రూపొందించారు. ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ బలోపేతం, చేనేత ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ అవకాశాలు సృష్టించడం వంటి అంశాలు ప్రధాన చర్చగా నిలిచాయి. సంక్షేమ పథకాల అమలు వేగవంతం చేయాలని నేతన్నలు కోరగా, మంత్రి సవిత వెంటనే అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేతన్నలకు సబ్సిడీలు, పింఛన్, ఆరోగ్య భద్రత వంటి పథకాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని అచ్చన్నాయుడు గారు ప్రాధాన్యతగా ప్రస్తావించారు. శ్రీకాకుళం నేతన్నల కళకు రాష్ట్రవ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకురావాలనే అభిప్రాయం ఇద్దరు మంత్రుల నుంచీ వ్యక్తమైంది. చేనేత రంగంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఇద్దరు మంత్రులు నేతన్నలకు భరోస ఇచ్చారు. “మీ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ప్రభుత్వం మీతోనే ఉంటుంది



నేతన్నలు ఎవరూ అధైర్యపడొద్దు” అని అచ్చన్నాయుడు సవిత ఏకగ్రీవంగా తెలిపారు. నేతన్నల అభ్యున్నతికి, వారి కళ వికాసానికి సంయుక్తంగా కట్టుబడి పనిచేస్తామని ఈ సమావేశం ద్వారా స్పష్టం చేశారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన కేంద్ర బృందం

కేంద్రం నకు తరలించి వైద్యాధికారి చేత వ్యాధి నిర్ధారించి, మందులను ఉచితంగా పంపిణీ చేయించాలని డీఎం అండ్ హెచ్ ఓకు సూచించారు. పాత డిఫార్మిటి కేసులకు అవసరమైన సేవలు, ఎంసీఆర్ చెప్పులు, పెన్షన్లు మొదలైనవి సకాలంలో అందేటట్లు చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇప్పటి వరకు సర్వే బాగుందని, మిగతా సర్వే కూడా పగడ్బందీగా జరిగేట్లు మానిటరింగ్ చేయాలన్నారు. అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతీ అనుమానిత కుష్ఠు వ్యాధి కేసులను గుర్తించాలని సూచించారు.

# దేశవ్యాప్తంగా ఆధార్ డాటా క్లీన్-అప్

నమోదు విభాగాల సమాచారం, వివిధ ప్రభుత్వ శాఖల ధృవీకరణ పత్రాల ఆధారంగా ఈ భారీ డీయాక్టివేషన్ ప్రక్రియ పూర్తయింది. చనిపోయిన వ్యక్తుల ఆధార్ నంబర్లు దుర్వినియోగం కావడం, మోసపూరిత స్కీమ్ క్లెయిమ్‌లు, లబ్ధిదారుల జాబితాల్లో తప్పుగా కొనసాగడం వంటి సమస్యలు గతంలో పలు జిల్లాల్లో నమోదవడంతో, కేంద్రం ఈ క్లీన్-అప్‌కు గట్టి ప్రాధాన్యత ఇచ్చింది. “ఆధార్ వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటం మా బాధ్యత” అని ఉడాయ్ స్పష్టం చేసింది. ఈ చర్య వల్ల పౌర సంక్షేమ పథకాల పంపిణీ మరింత ఖచ్చితంగా సాగుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పథకాలలో చనిపోయిన వ్యక్తుల పేర్లకు నిధులు వెళ్లకుండా అడ్డుకోవడం, బీమా-పెన్షన్ మోసాలను అరికట్టడం, రేషన్ కార్డు లబ్ధిదారుల జాబితాలను శుద్ధి చేయడం వంటి అనేక రంగాల్లో ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. ఆధార్ నంబర్ ఒక జీవిస్తున్న వ్యక్తికి చెందినదనే వ్యవస్థ స్థాయి ధృవీకరణను ఈ క్లీన్-అప్ బలోపేతం చేసింది. ఈ ప్రక్రియ దేశవ్యాప్తంగా ఇంకా కొనసాగుతుందని, అవసరమైన చోట్ల మరిన్ని ధృవీకరణలు చేపట్టనున్నామని ఉడాయ్ తెలిపింది. భవిష్యత్తులో ఆధార్ డేటా రికార్డులు రియల్-టైమ్‌లో అప్డేట్ అయ్యే విధంగా కొత్త మెకానిజమ్‌లను రూపొందిస్తున్నట్లు కూడా వెల్లడించింది. “ఆధార్ పౌరసేవలకు ద్వారమవ్వాలి, మోసాలకు ఆయుధం కాకూడదు” అనే లక్ష్యంతో ఈ క్లీన్-అప్ నిర్వహించినట్లు కేంద్రం స్పష్టం చేసింది.

# శ్రీ సత్యసాయి జిల్లాలో దారుణం

**- నాలుగేళ్ల బాలుడిని హత్య చేసిన మేనత్త భర్త**

**- కుటుంబ వివాదం కక్షగా మారి అమాయకుడి ప్రాణం బలి**

**- అపహరణ-హత్యలో నిందితుడిగా ప్రసాద్‌పై కేసు బలపరుస్తున్న పోలీసులు**

**- బాలుడి మృతదేహం గ్రామ సమీపంలో కనుగొనడంతో విషాదం**

మన గళం, శ్రీ సత్యసాయి జిల్లా : శ్రీ సత్యసాయి జిల్లాలో బంధుత్వానికే మచ్చ తెచ్చే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. నాలుగేళ్ల అమాయక బాలుడిపై చూపిన క్రూరత్వం గ్రామాన్ని విషాదంలో ముంచేసింది. వైద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో తన స్వంత మేనల్లుడినే కిడ్నాప్ చేసి హత్య చేశాడనే ఆరోపణలతో మేనత్త భర్త ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్.పి. కుంట మండలం గౌకనపేట గ్రామంలో జరిగిన ఈ ఘటన ప్రాంత ప్రజల్లో తీవ్ర కలకలం రేపింది. స్థానికుల సమాచారం, తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించారు. గౌకనపేటకు చెందిన గంగాధర్ కుమారుడు హర్షవర్ధన్ (4) బుధవారం ఉదయం ఇంటి వద్ద కనిపించకుండా పోయాడు. దొరకకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు పలు బృందాలను రంగంలోకి దించి శోధనా చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం గ్రామ సమీపంలో బాలుడి మృతదేహం లభించడంతో కేసు హత్యవైపుకు మలిచింది. డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపిన వివరాల ప్రకారం, బాలుడి హత్యలో నిందితుడు ప్రసాద్‌కే సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. ప్రసాద్ కుమారుడు క్యాన్సర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో తమ బావమరిది గంగాధర్‌ను వైద్య ఖర్చుల కోసం డబ్బులు అడిగాడని పోలీసులు గుర్తించారు. అయితే డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో గంగాధర్‌పై కక్ష పెంచుకున్న నిందితుడు, బుధవారం ఉదయం పిల్లవాడిని అపహరించి ఘాతుకానికి పాల్పడ్డాడని దర్యాప్తులో బయటపడింది. ఎస్ఐ నరసింహుడు వివరించిన ప్రకారం, నిందితుడు ప్రసాద్ ఇంటినుంచి బాలుడిని తీసుకెళ్లి గ్రామానికి సమీపంలోని ఓ పాడుబడిన ప్రదేశంలో హత్య చేశాడు. ఘటన వెలుగులోకి రాగానే ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయక బాలుడి ప్రాణం బలికావడంతో గ్రామంలో దుఃఖ వాతావరణం నెలకొంది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటించారు. బాలుడి కుటుంబానికి న్యాయం జరిగేలా దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది.



మా కలం.. మీ గళం.. మనగళం దిన పత్రిక

## 29న ఎమ్మిగనూరు లో దప్పుల ఆత్మగౌరవ సభ




మనగళం, కర్నూలు : ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం కర్నూలు జిల్లా 5వ మహాసభలను నవంబర్ 29న ఎమ్మిగనూరు లో నిర్వహిస్తున్న సందర్భంగా దళిత దప్పుల ఆత్మగౌరవ ప్రదర్శన బహిరంగ సభలు నిర్వహిస్తున్నామని ఏపీడీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు యం డి ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి బి కరుణాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం కర్నూలు నగరం లోని కార్మిక కర్షక భవన్ వద్ద ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకులు గుట్టపాడు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పాలక వర్గాలకు స్టేజీ కళాకారులపై ఉన్న కనీస ఆధరణ కూడా, తరతరాలుగా అంటరానితనాన్ని బరిస్తూ ఆకలి దప్పుల తో ఉన్న సాంప్రదాయ కళాకారులపట్ల లేకుండా పోయిందాన్నారు. డప్పు కళాకారుల సమస్యలతో పాటు యావత్ దళితులు ఎదుర్కనే సమస్యలపైనా పోరాటాలు నిర్వహించేలా 29న ఎమ్మిగనూరు లో జరిగే జిల్లా మహాసభ చర్చిస్తుందన్నారు. డిసెంబర్ 15 లోపు అన్ని జిల్లాల మహాసభలు నిర్వహించి జనవరి 3, 4న విశాఖ పట్టణం లో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామన్నారు. సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా గా జరిగే ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశం లో నాయకులు బైరాపురం కృష్ణ, బతకన్న, ముని తదితరులు పాల్గొన్నారు.

# లేఖనా కంపెనీపై చర్యలు తీసుకోవాలి



మనగళం, కర్నూలు సిటీ : రైతులకు నకిలీ వరి విత్తనాలు అంటగట్టిన లేఖన కంపెనీని సీజ్ చేయాలని, వరి విత్తనాలు అమ్మిన కిసాన్ సీడ్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బాధిత రైతులతో కలిసి వ్యవసాయ శాఖ సూపరింటెండెంట్ పద్మజ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అరికట్టడంలో అధికారులు చొరవ చూపాలన్నారు. లేఖనా కంపెనీ సరఫరా చేయగా, కర్నూలులోని కిసాన్ సీడ్స్ షాపు అమ్మకాలు చేపట్టిందన్నారు. ఇక్కడ నకిలీ వరి విత్తనాన్ని కొనుగోలు చేసి పంట సాగు చేసిన 18 మంది నిర్జూరు గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గత ఐదు వారాల క్రితం వరి విత్తనాలు నకిలీ విత్తనాలు సరఫరా చేశారని కలెక్టర్ కు రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులు వినతి పత్రం ఇచ్చారని గుర్తు చేవారు. స్పందించిన కలెక్టర్ వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించి రిపోర్టు ఇవ్వాలన్నారు. కర్నూలు ఏడీ, కర్నూలు శాస్త్రవేత్తలు స్పందించి నిర్జూరు రైతుల వరి పొలాలను పరిశీలించారన్నారు. వారు అక్కడే ఈ విత్తనాలు నకిలీ విత్తనాలని, కేడీలు ఎక్కువగా ఉన్నాయని ఒక ఎకరాకు 16 బస్తాలు నష్టపోయారని తెలియజేశారు. కంపెనీ యాజమాన్యం, కిసాన్ సీడ్స్ షాపు యాజమాన్యం సంయుక్తంగా రైతులు ఎక్కడికి వెళ్ళవద్దని, నష్టపరిహారం ఇస్తామని నమ్మబలికారన్నారు. అయితే ఇంతవరకు ఎలాంటి నష్టపరిహారం రైతులకు అందజేయలేదన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని నిర్జూరు వరి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో కిసాన్ సీడ్స్ షాపు ముందు నిరాహార దీక్షలు, వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నిర్జూరు మాజీ సర్పంచ్ కృష్ణ, స్థానిక రైతులు వెంకటేశ్వర్లు, ఎం.గిడ్డయ్య బి.గిడ్డయ్య, శ్రీనివాసులు అయ్యస్వామి, సోమశేఖర్, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తేవాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్







మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తేవాలని ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, డీఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ జిల్లాలలో పెండింగ్ లో ఉన్న ఫామ్స్ ను త్వరగా క్లియర్ చేయాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మీద ఈఆర్ఓ లకు, ఏఈఆర్ఓ లకు, బీఎల్ ఓ లకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమాల గురించి, ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియ, బీఎల్ఓ, ఎపిక్ కార్డుల పంపిణీ, తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్ లతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబంధించి ఈఆర్ఓ లకు, ఏఈఆర్ఓ లకు, బి ఎల్ ఓ లకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీఎల్ఓ లకు ఈరోజు జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బీఎల్ఓ ఐడీ కార్డులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న ఫార్మ్ లను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎపిక్ కార్డులను కూడా పంపిణీ చేశామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, ఎన్నికల విభాగం సూపరి%శీ%టెండెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు కల్పించాలి



మనగళం, కర్నూలు సిటీ : ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ డిశంబర్ 1 వ తేదీ అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ తెలిపారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం గురువారం జిల్లా అధ్యక్షుడు బి. వీరశేఖర్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా కేవీ నారాయణ మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల మూలంగా వ్యవసాయ పనులు లేక గ్రామీణ పేదలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వలసలు అరికట్టేందుకు వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం అని తొలగించి స్కీమ్ అని పెడుతున్నారని ఆరోపించారు. ఉపాధి పథకాన్ని కేంద్రం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఉదయం, సాయంత్రం మస్టర్ వేసే విధానాన్ని రద్దుచేయాలని, అందుకే డిసెంబర్ 1 న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని జిల్లా కమిటీ గా నిర్ణయించిందన్నారు. వ్యవసాయ కూలీలు తరలివచ్చి ధర్నాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె లింగన్న, సహాయ కార్యదర్శి బి. నాగన్న, నాయకులు బాలకృష్ణ,శ్రీరాములు, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

## నగర పరిశుభ్రత, భద్రత అందరి బాధ్యత

- ఖాళీ స్థలాల స్వచ్ఛంద శుభ్రత తప్పనిసరి
- రహదారుల్లో పశువులు వదిలితే చర్యలు
- ఆహారం బహిరంగంలో పారవేత నిషేధం
- నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగర పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, రహదారి భద్రత పట్ల ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర అందాన్ని కాపాడుకోవడం, ప్రజారోగ్యాన్ని సంరక్షించడం కోసం సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. నగరంలోని అపరిశుభ్రంగా పెరిగిన పిచ్చి మొక్కలతో ఉన్న ఖాళీ స్థలాలను యజమానులు వెంటనే శుభ్రం చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే రహదారులపై పశువులను వదిలితే వాటిని గోశాలకు తరలించి, ఒక వారంలో జరిమానా చెల్లించకపోతే యాజమాన్య హక్కులు రద్దవుతాయని స్పష్టం చేశారు. హొటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్, తదితర సంస్థల నిర్వాహకులు మిగిలిన ఆహారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాల్లో పారవేయరాదని హెచ్చరించారు. ఇది నగరంలో కుక్కల బెడద పెరగడానికి ప్రధాన కారణమవుతుంది తెలిపారు. మిగిలిన ఆహారాన్ని కేవలం మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకే అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు సమస్యలను నివారించి, స్వచ్ఛమైన నగర నిర్మాణంలో సహకరించాలని కమిషనర్ కోరారు.

# బీపీఎస్, ఎల్ఆర్యస్ అమలు వేగవంతం చేయాలి



- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : బిల్డింగ్ పీనలైజేషన్ పథకం (బీపీఎస్), లేఅవుట్ రెగ్యులరైజేషన్ పథకం (ఎల్ఆర్యస్) అమలు వేగవంతంగా జరగాలని, ఈ రెండు పథకాల ప్రయోజనాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. గురువారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని క్రెడాయ్ కార్యాలయ సమావేశ భవనంలో కమిషనర్, ప్రాంతీయ పట్టణ ప్రణాళిక ఉప సంచాలకులతో కలిసి బిల్డర్లు, పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు, అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ప్రజలు పూర్తిగా వినియోగించుకునేందుకు అధికార సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ నిర్మాణాలను గుర్తించాలని సూచించారు. సంబంధితులకి నోటీసులు జారీ చేసి బీపీఎస్, ఎల్ఆర్యస్ పథకాల ద్వారా తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేయాలని తెలిపారు. వచ్చే జనవరి 23 వరకు ఎల్ఆర్యస్, మార్చి 11 వరకు బీపీఎస్ గడువు కొనసాగుతుందని, అప్పటి వరకు ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా సూచించారు. అనుమతుల్లేకుండా నిర్మించిన భవనాలకు నిర్మాణ విస్తీర్ణం, స్థల యోజన, భద్రత హామీ పత్రం, రహదారి విస్తరణ సమ్మతి పత్రం, అర్హత కలిగిన నిర్మాణ ఇంజినీర్ అందించే స్థిరత్వ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ప్రభుత్వ భూములు, వివాదాస్పద యాజమాన్యభూములు, చెరువులు, వాగులు, కాలువలు ఆక్రమించి నిర్మించిన కట్టడాలు, తీరప్రాంత నియంత్రణ మండలి నియమాలకు విరుద్ధంగా ఉండే నిర్మాణాలకు బీపీఎస్ వర్తించదని స్పష్టం చేశారు. అనధికార లేఅవుట్ల విషయంలో తక్షణమే నోటీసులు జారీ చేసి, క్రమబద్ధీకరణకు ప్రజలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పథకాల ద్వారా క్రమబద్ధీకరణ చేయనివారిపై చట్టపరమైన చర్యల్లో ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. ఎల్ఆర్యస్ పథకానికి ఇప్పటివరకు రెండు విడతల్లో మొత్తం 1,988 దరఖాస్తులు అందాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా సూచించారు. ప్రాంతీయ పట్టణ ప్రణాళిక ఉప సంచాలకులు మాట్లాడుతూ.. 120 రోజుల్లోగా లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్లు (ఎల్టీపీ) దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. 1986 జనవరి 1 నుంచీ 2025 ఆగస్టు 31 వరకు నిర్మించబడిన భవనాలకు బీపీఎస్ వర్తిస్తుందని చెప్పారు. 60 గజాలలోపు (జీం1) నివాస గృహాలకు బీపీఎస్ వర్తించదని, 1997 డిసెంబర్ 31కి ముందు నిర్మాణాలపై పీనలైజేషన్ రుసుముల్లో 25శాతం రాయితీ, నోటిఫైడ్ మురికివాడల్లో 50శాతం రాయితీ వర్తిస్తుందని వివరించారు. దరఖాస్తు కోసం యాజమాన్య హక్కు పత్రం, ఎన్కంబరెన్స్, మార్కెట్ విలువ సర్టిఫికెట్, అనుమతి ప్లాన్, భవనం పూర్తి చూపించే రెండు తాజా ఫొటోలు, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాల డ్రాయింగ్లు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. బిల్ట్అప్ ఏరియా, సైట్ ప్లాన్, ఇండెమ్నిటీ బాండ్, రోడ్డు విస్తరణ సమ్మతి పత్రం, స్ట్రక్చరల్ ఇంజినీర్ ఇచ్చే నిర్మాణ స్థిరత్వ ధ్రువీకరణ పత్రం కూడా తప్పనిసరని తెలిపారు. సమావేశంలో ఇన్ఛార్జి సిటీ ప్లానర్ వెంకటరమణ, జిల్లా పట్టణ నిర్మాణ అధికారి శశిలత, కుడా సహాయ ప్రణాళికాధికారి హయాత్ మొద్దిన్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, క్రెడాయ్ నిర్వాహక సభ్యులు, సాంకేతిక నిపుణులు తదితరులు పాల్గొన్నారు

# కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ

- కేంద్ర కమిటీ అబ్జర్వర్ హెచ్ సీ యోగేష్

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కాంగ్రెస్ కేంద్ర కమిటీ పరిశీలకులు హెచ్ సీ యోగేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఏపీసీసీ పరిశీలకులు సాకే శంకర్, సొంటి నాగరాజుతో కలిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఆయన మాట్లాడారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని ప్రక్షాళన చేసి, పార్టీని బలోపేతం చేసే దిశలో భాగంగా ప్రతి జిల్లా మరియు నగర కాంగ్రెస్ నూతన అధ్యక్షుల నియామక ప్రక్రియ చేపట్టామన్నారు. కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఆసక్తిగల ఆశావహులు 29:11:2025 తేదీ శనివారం సాయంత్రం నాలుగు గంటల నుండి కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేంద్ర కమిటీ పరిశీలకులు అందుబాటులో ఉంటామని, ఎవరైనా దరఖాస్తు చేసుకునే స్వేచ్ఛ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో అభివృద్ధి చేసి పార్టీ సిద్ధాంతాలకు, విలువలకు కట్టుబడి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే ఆసక్తి గల

# కర్నూలులో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టం ఏర్పాటు చేయాలి



మనగళం, కర్నూలు సిటీ : వర్షాలు కురిసిన గాలి వీచిన విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, నిర్మూలించాలంటే కర్నూల్ లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ విధానాన్ని ఏర్పాటు చేయాలని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరంలో పలు వీధులలో రోడ్లపై విద్యుత్ స్తంభాలు విద్యుత్ వైర్లు విచ్చలవిడిగా కనిపిస్తున్నాయన్నారు. చిన్న వర్షం పడిన రోడ్డు మీద నుంచి వెళ్లాలంటే ప్రజలు భయపడాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో విద్యుత్ స్తంభానికి పెద్ద సంఖ్యలో కేబుల్ వైర్లు కనిపిస్తున్నాయని, కాలనీలో ఇళ్లకు అపార్ట్మెంట్ లోకి లాగేసి ఉంటున్నారని తెలిపారు. చాలామంది విద్యుత్ ఘాతంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. బెంగళూరు లాంటి రాష్ట్రంలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారని, అదేవిధంగా కర్నూలు నుండి మొదలు పెట్టాలని ఆయన కోరారు. కర్నూల్ కార్పొరేషన్ పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ పద్ధతి ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని, దీనిపై అధ్యయనం కూడా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ తో పాటు ఫైబర్ వివిధ కేబుల్ నెట్వర్క్ వైర్స్ అన్ని అండర్ గ్రౌండ్ లోనే ఉండేలా చేయాలని, దీనిపై ఆయా కంపెనీలతో ప్రభుత్వం చర్చించాలని కోరారు. శి

# ప్రభుత్వ నిబంధనలు పాటించని బీఈడీ కాలేజీలను రద్దు చేయాలి




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధన లకు విరుద్ధంగా నడుపుతున్న కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం డీవైఎఫ్ జిల్లా కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా, ఉపాధ్యక్షులు హుస్సేన్ బాషా మాట్లాడారు. బీఈడీ చదువును దూరవిద్య చదువులా కర్నూలులోని బీఈడీ కాలేజీలు చేస్తున్నాయన్నారు. కాలేజీలలో ఎటువంటి తరగతులు నిర్వహించకుండా నేరుగా సెమిస్టర్ ఎగ్జామ్స్ రాయిస్తున్నారన్నారు. ఒకే బిల్డింగ్ లో రెండు మూడు కాలేజీల పేర్లు పెట్టి నిర్వహిస్తున్నారని, అక్కడ ఫ్యాకల్టీలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏమీ లేకపోయినా యూనివర్సిటీ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. అదేవిధంగా మూడో సెమిస్టర్ లో బ్లాక్ టీచింగ్ ప్రాక్టికల్స్ తర్వాత థియరీ ఎగ్జామ్స్ కి అనుమతి ఇవ్వాలని, అయితే ప్రాక్టికల్లు బ్లాక్ టీచింగ్ చేయించకుండా టీచర్ వృత్తికే అవమానం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కొక్క సీటు లక్ష నుండి లక్ష యాభై వేల వరకు అమ్ముకుంటున్న పరిస్థితి నెలకొందన్నారు. డబ్బే ధ్యేయంగా నడిపిస్తున్న బీఈడీ కాలేజీల పైన యూనివర్సిటీ అధికారులు దృష్టి సారించాలని, నిబంధనలు పాటించని కాలేజీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# ఓటర్ల మ్యాపింగ్ లో పొరపాట్లకు తావివ్వరాదు

**- బీఎల్వో లు ఇంటింటికీ వెళ్లి విచారించాలి - జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**




మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో నిర్వహిస్తున్న ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పొరపాట్లకు తావివ్వరాదని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి శిక్షణా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో కర్నూలు (అర్బన్), పాణ్యం, ఆదోని నియోజకవర్గాల బూత్ లెవెల్ ఆఫీసర్ (బిఎల్ఓ)ల తో ఎస్.ఐ.ఆర్ - 2026 శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కర్నూలు, పాణ్యం ,ఆదోని నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల మ్యాపింగ్ వెనుకబడి ఉందన్నారు. ఈ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల నిర్వహణ చాలా కీలకమన్నారు. ఎన్నికల నిర్వహణ బాగా జరగాలంటే పటిష్టమైన ఓటర్ జాబితా ఉండాలన్నారు. అందులో భాగంగానే ఈ యొక్క ప్రక్రియ నిర్వహణ జరుగుతోందని తెలిపారు. 2002 ఓటర్ల జాబితా, 2025 ఓటర్ ల జాబితా లో ఉన్న ఓటర్లను సరిచూసి ఓటర్లను మ్యాపింగ్ చేయడం జరుగుతోందని, ముందుగా టేబుల్ టాప్ ఎక్సర్సైజ్ ను పూర్తి చేసి అనంతరం బిఎల్వో లు ఇంటింటికీ వెళ్ళి ఓటర్ల గురించి విచారించాలని సూచించారు. నిర్ణీత ఫారంలలో ఓటర్ వివరాలు సేకరించుకోవాలని, ఆ తర్వాతనే డ్రాఫ్ట్ రోల్ లో పేర్లు ఉంచాలని తెలిపారు. మరణించిన ఓటర్ వివరాలు, అందుబాటులో లేని ఓటర్ల వివరాలు నిర్ణీత ఫారాలలో సేకరించుకొని, నోటీసులు అందజేసి తొలగించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే పది రోజుల్లో అర్బన్ 80 శాతం, రూరల్ 90 శాతం ఓటర్ల మ్యాపింగ్ జరగాలని, ఈ ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మ , సంబంధిత నియోజకవర్గాల తహసీల్దార్ లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారులు పాల్గొన్నారు.

# డాక్టర్ రాధాకుమారికి ఘన సన్మానం




మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అధిపతి ప్రొఫెసర్ సుధా కుమారి ఈనెల 30న పదవీ విరమణ సందర్భంగా కాలేజీ యందు కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, ఏపీ జీడీఏ విభాగం వేర్వేరుగా వీడ్కోలు సభలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ రాధాకుమారిని ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏడీయంఈ అండ్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా చిట్టి నరసమ్మ, ఏడీఎంఈ అండ్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏపీజీడీఏ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మాజీ తదితరులు డాక్టర్ రాధాకుమారి సేవలను కొనియాడారు. అంకితభావంతో విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు. 38 సం. రాల ప్రభుత్వ సర్వీసు చాలా సంతృప్తినిచ్చిందని, కర్నూల్ మెడికల్ కాలేజీలో పనిచేసిన మూడు సంవత్సరాలు ఎప్పటికీ గుర్తుంటుందని ఈ సందర్భంగా సన్మాన గ్రహీత డాక్టర్ రాధాకుమారి పేర్కొన్నారు. అన్నివిభాగాల అధిపతులు ఎంతో సహకారం అందజేశారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్స్ సిందియా శుభప్రద, డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ విజయ్ ఆనంద్ బాబు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ డా.రేణుక, ఏపీ.జి.డి.ఏ నాయకులు డాక్టర్ మాధవి శ్యామల డాక్టర్ ధమ్మమ్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీరాములు, డిప్యూటీ సూపరిండెంట్ డా .శ్రీలక్ష్మి, డి. సి. యస్ లు డా. రాధ, డా. వెంకటరమణ, డా. స్వర్ణకుమారి అసిస్టెంట్ ఆఫీసర్లు డాక్టర్ రవి నాయక్ డాక్టర్ పుష్పలత డాక్టర్ ప్రవీణ డా. ప్రసన్న రాణి,డాక్టర్ నాగరాజు, డా. వైష్ణవి, డా. శైలజ డా.కీర్తి, డా రంగ తులసీ, లెక్షరర్ లు సురేష్ కుమార్, భవాని ప్రసాద్, సరిత, ఇంజనీర్ రాజశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ షణ్ముఖుడు,హెల్త్ సూపర్వైజర్లు సాయిరాం, మాధవరాజు, నాగేశ్వరమ్మ, సుభాషిని, సీనియర్ అసిస్టెంట్ డాక్టర్, యాస్మిన్, డా. సుమ కీర్తన ఐశ్వర్య మెర్సి, డాక్టర్ కార్తీక్, నర్మద, మౌనిక, అపర్ణ, సబిహా, నక్షత్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# భారత తొలి అతి వేగ రైలు..

న్యూఢిల్లీ, నవంబర్ 27, మనగళం, భారతదేశంలోనే మొట్టమొదటి అతి వేగ రైలు ప్రాజెక్టు కీలక దశకు చేరింది. ముంబై%-%అహ్మదాబాద్ మధ్య నిర్మాణంలో ఉన్న బుల్లెట్ రైలు కారిడార్ ఇప్పటివరకు 55 శాతం భౌతిక పురోగతి సాధించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే దాదాపు ఎనిమిది వేల మూడొందల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు కాగా, మొత్తం వ్యయం పదకొండు లక్షల కోట్ల రూపాయల దాకా వెళ్లే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ కారిడార్ పూర్తయిన తర్వాత ముంబై నుంచి అహ్మదాబాద్ వరకు ప్రయాణ సమయం కేవలం ఒక గంట యాభై ఎనిమిది నిమిషాలకే పరిమితం అవుతుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. గంటకు మూడు వందల ఇరవై కిలోమీటర్ల వేగంతో పరుగులు తీసే ఈ రైలు భారత రైల్వే చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలవనుంది. నాలుగు ప్రధాన నిలయాల్లో మాత్రమే ఆగే సర్వీసు అందుబాటులో ఉంటే ప్రయాణం ఒక గంట యాభై ఎనిమిది నిమిషాల్లో పూర్తవుతుందని, పన్నెండు నిలయాల్లో ఆగే సర్వీసు అయితే రెండు గంటల పదిహేడు నిమిషాలు పడుతుందని తెలిపారు. ప్రథమ దశలో 2027 ఆగస్టులో సూరత్ నుంచి వాపి మధ్య వంద కిలోమీటర్ల విభాగంలో మొదటి ఆపరేషనల్ ప్రయాణాన్ని ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత దశలవారీగా మొత్తం 508 కిలోమీటర్ల కారిడార్ను పూర్తి చేస్తామని, 2029 డిసెంబర్ నాటికి సంపూర్ణంగా సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు.

# రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మనగళం, కర్నూలు : రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమాన్నిప్రవేశపెట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. కర్నూలు మండలం, గార్గేయపురం గ్రామంలో గురువారం నిర్వహించిన "రైతన్నా మీకోసం" కార్యక్రమానికి జేసీ హాజరయ్యారు. ఏడీఏ సాలు రెడ్డి, తహసీల్దార్ రమేష్, వ్యవసాయ అధికారి రుఫస్ రోనాల్డ్, సర్పంచ్ యేసేపు తదితర అధికారులతో కలిసి జేసీ రైతులతో సమావేశమయ్యారు. సాగుకు సంబంధించిన అంశాలను రైతులతో చర్చించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన "రైతున్నను రాజు చేసే పంచ సూత్రాలు" అమలు ప్రాధాన్యాన్ని జేసీ వివరించారు. శాస్త్రీయ వ్యవసాయంతో రైతు సంక్షేమం సాధ్యమన్నారు. రైతుల పెట్టుబడి భారం తగ్గించడం, పండించిన పంటకు న్యాయమైన, లాభదాయక ధరలను కల్పించడం, వ్యవసాయ సేవలను గ్రామ స్థాయికి సమర్థంగా అందించడం, వ్యవసాయ ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెటింగ్ అవకాశాలను కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అదేవిధంగా అధికారులకు జేసీ సూచనలు చేశారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ సేవలు చేరేలా సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. రైతులు ప్రస్తావించిన పంట నిర్వహణ, ఇన్పుట్ లభ్యత, సాగు నీరు, మార్కెటింగ్ వంటి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

# ఈవ్ టీజింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు

మనగళం, కర్నూలు క్రైం : ఈవ్ టీజింగ్, ఆకతాయి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థల వద్ద యాంటీ ఈవ్ టీజింగ్ బీట్ లను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఈవ్ టీజింగ్ , ఆకతాయిల వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలని, కనీసం డయల్ 112, డయల్ 100 కు సమాచారం అందించాలని విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన చేస్తున్నారు. జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధులలోని పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ పాల్పడే వారి పై నిఘా ఉంచి ఈవ్ టీజింగ్ బీట్స్ పోలీసులు కౌన్సిలింగ్ చేస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు పోలీసులు.

# పతంజలి ఐదు లక్షల కోట్ల లక్ష్యం..




హరిద్వార్, నవంబర్ 27, మనగళం : భారత ఆరోగ్య, ఆయుర్వేద రంగంలో పతంజలి మరో భారీ అడుగు వేస్తోంది. ఐదు లక్షల కోట్ల రూపాయల మార్కెట్ విలువ సాధించాలనే మహత్తర లక్ష్యంతో సంస్థ సరికొత్త వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు పతంజలి అధినేతలు వెల్లడించారు. దేశీయంగానే కాదు, ప్రపంచ వ్యాప్తంగా తనదైన ముద్ర వేయాలనే సంకల్పంతో ఆయుర్వేదం, యోగా, సంపూర్ణ ఆరోగ్య భావనలను ప్రజల జీవితాల్లో భాగంగా మార్చే దిశగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. స్వామి రాందేవ్, ఆచార్య బాలకృష్ణ నాయకత్వంలో పతంజలి తమ వ్యాపార లక్ష్యాలను కేవలం ఉత్పత్తుల అమ్మకాలకే పరిమితం చేయకుండా సంపూర్ణ ఆరోగ్య సంస్కృతికి విస్తరించింది. ఆయుర్వేద ఉత్పత్తులు ప్రతి భారతీయ ఇంటికి చేరేలా చూడటం, యోగా, ప్రాణాయామం వంటి ప్రాచీన పద్ధతులను ఆధునిక జీవనంలో భాగం చేయడమే ప్రధాన లక్ష్యంగా నిర్ణయించింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా, విదేశాల్లో దశ వేల వెల్నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది.

ఈ వెల్నెస్ కేంద్రాల ద్వారా ప్రజలకు యోగా శిక్షణ, ఆయుర్వేద వైద్య సలహాలు, ప్రకృతి వైద్యం వంటి సేవలు అందించనున్నారు. అంతేకాకుండా డిజిటల్ సాంకేతికతను వినియోగిస్తూ ఇంటి నుంచే ఆరోగ్యాన్ని పర్యవేక్షించుకునే విధంగా ప్రత్యేక మొబైల్ యాప్లు, ధరించగలిగే పరికరాలను కూడా ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. దీని ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా సులభంగా ఆరోగ్య సేవలు అందించాలన్నది వారి లక్ష్యంగా పేర్కొన్నారు.

వచ్చే రెండేళ్లలో తమకు అనుబంధంగా ఉన్న నాలుగు సంస్థలను పబ్లిక్గా జాబితాలోకి తీసుకురావాలనే యోచనలో పతంజలి ఉంది. 2027 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. ప్రస్తుతం భారత్లో ఆరోగ్య, వెల్నెస్ మార్కెట్ ఏటా పదిహేను శాతం వరకు వృద్ధి చెందుతోందని, ఇదే వేగాన్ని కొనసాగిస్తే ఐదు లక్షల కోట్ల మార్కెట్ విలువ సాధ్యం అవుతుందని కంపెనీ అంచనా వేస్తోంది.

# సంపాదకీయం

## రెడ్ ప్లానెట్ డే: భారత అంతరిక్ష స్వప్నాలను కొత్త శిఖరాలకు తీసుకెళ్లే శాస్త్రీయ యుగం

రెడ్ ప్లానెట్ డే అనే సందర్భం వస్తే ప్రపంచం మార్స్ వైపు మరోసారి దృష్టిని కేంద్రీకరించకుండా ఉండదు. శతాబ్దాల తరబడి భూమికి అత్యంత సమీపంగా జీవం అవకాశాలు ఉన్న గ్రహం మార్స్ అన్న భావన శాస్త్రకుటుంబంలో గాఢంగా నాటుకుంది. భూమిపై పెరుగుతున్న జనాభా, వాతావరణ మార్పులు, భవిష్యత్ పునరావాస అవకాశాలపై ప్రపంచ దేశాలు ఆలోచిస్తున్న వేళ మార్స్ సైన్స్‌కి కొత్త అర్థాలు ఇస్తోంది. ఈ గ్రహం మీద నీరు ఉన్న చరిత్ర, భూభాగ నిర్మాణాలు, ఉపరితలం క్రింద దాగి ఉండే ఖనిజ సంపద ఇలాంటి రహస్యాలు అంతరిక్ష సంస్థలను నిరంతరం ఆకర్షిస్తున్నాయి. అందుకే ప్రతి సంవత్సరం ఈ రోజున మార్స్ అన్వేషణలో చేసిన పురోగతిని ప్రపంచం ఒకసారి పరిశీలిస్తుంది. ఈ పరిశీలనలో భారత్ ఎదుగుదల ఇప్పుడు ఎంతో మంది మనసుల్లో ప్రత్యేకమైన స్థానం సంపాదించింది.

భారత్ అంతరిక్ష చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మక అధ్యాయం మంగళ్‌యాన్ ప్రయోగమే. అది కేవలం ఒక ఆర్‌బిటర్ కాదుబీ అది దేశ సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించిన శాస్త్రీయ ఉద్యమం. ఒకే ప్రయత్నంలో, అంత తక్కువ బడ్జెట్‌తో మార్స్ కక్ష్యలోకి చేరగలిగిన మొదటి దేశంగా భారత్ నిలిచినది అంటే అది సాధారణ విషయం కాదు. మార్స్‌పై నుంచి పంపిన తొలి చిత్రాలు భారత యువత హృదయాల్లో విజ్ఞానం పట్ల కొత్త ఆలోచనలను రేకెత్తించాయి. ఈ ప్రయోగం నుంచి సేకరించిన మీథేన్ వివరాలు, ఉపరితల ధూళి లయలు, వాతావరణ ఒత్తిడి మార్పులు ఇవి ప్రపంచ శాస్త్రవేత్తల పరిశోధనలకు బలమైన ఆధారాలుగా నిలిచాయి. ఈ మిషన్ తర్వాత భారత్‌ను అంతర్జాతీయ అంతరిక్ష రంగంలో తక్కువ అంచనా వేయలేనని ప్రపంచానికి తెలిసిపోయింది.

ఇప్పుడు ప్రపంచం రెండో దశ మార్స్ పోటీకి దిగింది. అమెరికా పర్సివీరెన్స్ వంటి రోవర్లతో విస్తృత పరిశోధన చేస్తుంటే, చైనా, యూరప్, జపాన్ తమ తమ ప్రయోగాలతో మార్స్ ఉపరితలం పై మరింత లోతైన పరిశీలన చేస్తున్నారు. ఇంటర్‌ప్లానెటరీ మిషన్‌లలో రోబోటిక్స్ ప్రాముఖ్యం పెరిగిన వేళ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రోవర్లు మార్స్ పరిశోధనకు కొత్త తరహా సవాళ్లను తెస్తున్నాయి. ఈ వేగవంతమైన పోటీలో భారత్ తన స్థానాన్ని బలంగా నిలబెట్టుకోవాలంటే భవిష్యత్ మిషన్లను మరింత ధైర్యంగా ముందుకు తీసుకెళ్లాలి. మంగళ్‌యాన్%-%2 వంటి మిషన్లతో అధునాతన పరికరాలు, కొత్త పరిశోధనా పద్ధతులు, మరింత ఖచ్చితమైన శాస్త్రీయ లక్ష్యాలను చేరుకోవడానికి %×ూ=ూ% సిద్ధమవుతోంది. ఇవి పూర్తి అయితే భారత్ మార్స్ పరిశోధనలో కొత్త యుగానికి నాంది పలికే అవకాశం ఉంది.

అంతరిక్ష పరిశోధనలో మరో ముఖ్యం ఏమిటంటే అంతర్జాతీయ సహకారం. మార్స్ పరిశోధన ఒక్క దేశం చేతిలో పూర్తయ్యే పనే కాదు. పెద్ద బడ్జెట్‌లు, ఆధునిక సాంకేతికత, అత్యంత నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తల బృందాలు ఇవి కలిసినప్పుడే మార్స్‌పై మరింత స్పష్టమైన దృష్టి సాధ్యమవుతుంది. ఈ సందర్భంలో భారత్ నాసా, %జుూూ%, జాక్సా వంటి సంస్థలతో కలసి చేసే ప్రాజెక్టులు శాస్త్రీయ మార్పిడికి దారితీస్తాయి. ప్రపంచ పరిశోధనలో పాలు పంచుకోవడం ద్వారా భారత్‌కు అందే సమాచారం దేశ శాస్త్రీయ వాతావరణాన్ని మరింత సమృద్ధి చేస్తుంది. దీని ద్వారా భవిష్యత్ మిషన్లలో భారత్ కీలక పాత్ర పోషించే అవకాశం రెట్టింపు అవుతోంది. ఇంతటి అంతరిక్ష అభివృద్ధికి ప్రధాన స్తంభం భారత యువత. ప్రస్తుతం పాఠశాల స్థాయి నుంచే అంతరిక్షంపై ఆసక్తి పెరగడం గమనించదగ్గ విషయం. రాకెట్ మోడళ్ళు తయారు చేసే పిల్లలు, కాలేజీల్లో సాటిలైట్ ప్రాజెక్టులను చేపట్టే విద్యార్థులు, అంతరిక్ష సాంకేతికతలోకి ప్రవేశిస్తున్న స్టార్టప్‌లు ఇవి అన్నీ కలిపి భారత అంతరిక్ష రంగానికి ఒక కొత్త తరం పునాది వేస్తున్నాయి. ప్రైవేట్ కంపెనీలు ఇప్పుడు ప్రయోగ వేదికలు, ఇంటర్‌ప్లానెటరీ టెక్నాలజీపై పెట్టుబడులు పెడుతున్నాయి. ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల కలయిక భారత అంతరిక్ష దిశను పూర్తిగా మార్చే శక్తి కలిగివుంది. రెడ్ ప్లానెట్ డే ఈ దిశగా మనలో కొత్త ఆలోచనలను, కొత్త పరిశోధనలను, కొత్త కలలను రేకెత్తించే రోజు. రెడ్ ప్లానెట్ డే మనకు గుర్తు చేస్తోంది. మార్స్ అన్వేషణ కేవలం శాస్త్రీయ పోటీ కాదుబీ అది మానవజాతి భవిష్యత్తుకు సంబంధించిన ప్రయాణం. ఆ ప్రయాణంలో భారత్ ఎంతో వేగంగా, ధైర్యంగా, నమ్మకంగా ముందుకు సాగుతోంది. విజ్ఞానాన్ని ఆరాధించే దేశంగా మన ప్రత్యేకతను ప్రపంచం గుర్తించడం ఇదే కారణం. శాస్త్రం, సాంకేతికత, అవిష్కరణలతో ముందుకు సాగితే మార్స్‌పై భారత జెండా ఎగురవేసే రోజు దూరంలో లేదు అని ఈ రోజు మనలో విశ్వాసాన్ని నింపుతుంది.

# మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ని కలిసిన న్యాయవాదులు

మన గళం బనగానపల్లె : సహాయ గుణము ఎల్లప్పుడు ప్రజాధరణ పొందుతున్న మాజీ సర్పంచ్ బీసీ రాజా రెడ్డి ని కలిసిన బనగానపల్లె న్యాయవాదులు వారు అడిగిన వెంటనే కోర్టు ప్రాణాన్ని శుభ్రపరచి మరియు బార్ అసోసియేషన్‌కు సొంత నిధులు కలిగిన నాణ్యత కుర్చీలను ఇప్పించినందుకు రాజారెడ్డి గాని శాలువతో సత్కరించి స్విట్ తినిపించారు

కోర్టు నూతన భవనానికి మినిస్టర్ గారి దృష్టికి తీసుకోని వేళ్తాను అని అన్నారు అడ్వకేట్స్ అందరికి ఇండ్ల స్థలాల విషయం కూడ మాట్లాడుతాను అని అన్నారు %దీజ% రాజారెడ్డి గారికి న్యాయ వాదులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు



# జన గణన చేపట్టాలి.





మన గళండోన్ : జన గణన చేపట్టాలని ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ విద్యార్థి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఇమిడి లక్ష్మణసాయి ఆధ్వర్యంలో డోన్ మండలంలోని స్థానిక వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయం నందు %ూదీజ% జన గణన అనే అంశంపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, %ూ=జూ% నాయకులు డోన్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, వడ్డేర సంక్షేమ సంఘం డోన్ నాయకులు నాగరాజు, కాంగ్రెస్ పార్టీ డోన్ నియోజకవర్గ ఇంచార్జి గార్లపాటి మద్దిలేటి , జనార్ధన్, సి.పి.ఐ పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు నేను కుమ్మరి సంఘం నాయకులు కుమ్మరి రాజు, శాలివాహన సంఘం నాయకులు ఓబులేసు, మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, %వీ=ూ% నాయకులు భూమన నాగన్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు చిన్న రాయుడు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా హుస్సేనప్ప తదితర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ దేశంలో సింహాలు, పులులు, జింకలు, పశువులు, చెట్లు, ఇలా ప్రతివాటి లెక్కలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. ఎప్పటికప్పుడు వాటిని లెక్కిస్తూనే ఉన్నారు, కానీ దేశం లో ల కుల ఆధారిత జన గణన చేయక పోవటం వెనక పాలకుల కుట్ర దాగి వుంది అని,1871 నుండి %ూదీజ% లో జన గణన పట్ల పాలకులు చేస్తున్న కుట్రల గురించి %ూదీజ% లు తెలుసుకోవాలని ఆమె అన్నారు .%దీూవీజజుఖీ% మరియు నేషనల్ %ూదీజ% మోర్చా ల ఆధ్వర్యంలో %ూదీజ% లో కుల ఆధారిత జన గణన చేయాలని డిమాండ్ చేస్తూ,1871 నుండి ఆ తరువాత స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు %ూదీజ% ల కుల ఆధారిత జన గణన ఎందుకు చేపట్టలేదు కుల ఆధారిత జన గణన యొక్క అవశ్యకత మరియు దాని వలన %ూదీజ% లకు కలిగే ప్రయోజనాల గురించి క్లుప్తంగా వివరిస్తూ డిసెంబర్ నెల 14 వ తేదీన కర్నూలు నందలి జిల్లా పరిషత్ హాల్ నందు జరుగు %ూదీజ% సభలో %ూదీజ% లు ఎస్సీ ఎస్టీ మైనార్టీ లు పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజా కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ కుల సంఘాలను చైతన్య పరిచి 14వ తేదీ జరగబోయే %ూదీజ% కుల ఆధారిత జన గణన జరిగే వరకు బీసీలందరూ చైతన్యమై ఇటువంటి సమావేశాలను జయప్రదం చేయాలని ఆ విధంగా వారు బీసీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా ఐక్య వేదిక నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు ఆకుతోట పద్మావతి, డోన్ మండల కమిటీ సభ్యులు షేకున్ బి, లక్ష్మేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వాసవీమాత చిత్రపటానికి పాలాభిషేకం




మనగళం, పెనుగొండ : పెనుగొండ పేరును వాసవీ పెనుగొండ గా ప్రభుత్వం మార్చడంపై ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి ఆర్యవైశ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, నంద్యాల నాగేంద్ర ఆధ్వర్యంలో డూండి రాకేష్ కార్యాలయం వద్ద వాసవీ మాతకు పాలాభిషేకం చేశారు. అదేవిధంగా పీఎం నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ చిత్ర పటాలకు ఆర్యవైశ్యులు పాలభిషేకం చేశారు. లకు పాలాభిషేకాలు ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది.

# అవుకులో మాక్ అసెంబ్లీ



మన గళం అవుకు : నంద్యాల జిల్లా అవుకు పట్టణంలో గురువారం ప్రభుత్వ బాలికల పాఠశాలలో మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముందుగా రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసిన అనంతరం బిఆర్ అంబేద్కర్ ను ఉద్దేశించి ప్రధాన ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి ప్రసంగించడం జరిగింది. ప్రసంగం అనంతరం పాఠశాల ఆవరణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగా మౌనిక, సభ అధ్యక్షురాలుగా అక్షయ, ప్రతిపక్ష నాయకులుగా కీర్తి, మనీషా, విద్యాశాఖ మంత్రిగా షహనాజ్, డిప్యూటీ సీఎం గాయత్రి, రోడ్లు భవనాల శాఖ మంత్రి గా ప్రియా, తదితర విద్యార్థులు తదితర అసెంబ్లీ మంత్రులుగా వ్యవహరించి ప్రజా సమస్యలపై వాదోపవాదోలు అద్భుతంగా ప్రదర్శించడం జరిగింది. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు రాజేశ్వరి ఆధ్వర్యంలో చిత్రలేఖనం వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయడం జరిగింది. మాక్ అసెంబ్లీ ఇంత అద్భుతంగా రావడానికి కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయ కుమారిని ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

# కొడుమూరు మండలం కిస్తాపురం. గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం



మన గళం కోడుమూరు: కొడుమూరు మండలం కిస్తాపురం. గ్రామంలో ఈరోజు రైతన్న మీకోసం కార్యక్రమం లో పాల్గొన్న కోడుమూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మండల అగ్రికల్చర్ అధికారి రవి ప్రకాష్ కోడుమూరు టిడిపి నాయకులు బలరాముడు కిస్టాపురం టిడిపి నాయకులు శంకర్ రెడ్డి పురుషోత్తం రెడ్డి మరియు రైతులు అందరూ పాల్గొనడం జరిగింది కెడిసిసీ చైర్మన్ శ్రీ విష్ణువర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు కార్యక్రమానికి వచ్చామని వారు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి రైతులతో ముఖాముఖిగా కలిసి వారి సమస్యలు తెలుసుకొని అన్ని విధాలుగా ప్రభుత్వం వారికి సహకరిస్తుందని అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టి నటువంటి పథకాలు గురించి అవి ఎలా ఉపయోగించుకోవాలో రైతులకు వారు తెలియజేశారు.

# డిసెంబర్ 5న ఆత్మీయ సమావేశం



– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మనగళం, నంద్యాల : డిసెంబర్ 5న జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా తల్లిదండ్రులు%-%ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పీటీయం)ను నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఈ సమావేశానికి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరై పిల్లల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులతో ప్రత్యక్షంగా చర్చించాలని సూచించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ తన ఛాంబర్ నుంచి ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో మెగా పీటీఎం ఏర్పాట్లపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ డిసెంబర్ 5వ తేదీ ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం కొనసాగుతుందన్నారు. ఇందులో విద్యార్థుల అకడమిక్ ప్రదర్శన, చదువులో ఎలా ఉన్నారు, ఇతర కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటున్నారు, అభివృద్ధి ఎలా ఉంది అనే విషయాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడుతారన్నారు. సమావేశం అనంతరం హెచ్‌పీసీ (హొలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డు) ను విద్యార్థులకు అందజేస్తారని, తద్వారా పిల్లల స్థితిని తల్లిదండ్రులు స్పష్టంగా తెలుసుకునే అవకాశముంటుందని వివరించారు. మధ్యాహ్నం 12.45 గంటల నుంచి తల్లిదండ్రులకు కూడా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల హాజరు, పరీక్ష ఫలితాలు, దినచర్యా పురోగతి తదితర వివరాలను సమయానుకూలంగా తెలుసుకోవడానికి ప్రభుత్వం అందించిన లీప్ యాప్ ( లర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. అలాగే, ఎఫ్.ఎల్.ఎన్. (ఫక్షనల్ లిట్రసీ అండ్ నూమర్సీ) పరిధిలో విద్యార్థులు చదువుతున్న తరగతికి తగ్గ పఠన%-%లేఖన నైపుణ్యాలు ఉన్నాయా లేవా అన్న విషయంపై కూడా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చిస్తారని తెలిపారు. 10వ తరగతి విద్యార్థుల సిలబస్ డిసెంబర్ 5 నాటికి పూర్తికాబోతోందని, అక్కడి నుంచి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా వారికి పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ అందించనున్నట్లు స్పష్టం చేశారు. పాఠశాలలకు ప్రభుత్వం అందించిన మౌలిక వసతులు, క్రీడా సామగ్రి, లర్నింగ్ కిట్లు, అలాగే విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లను కూడా పిటియం సందర్భంగా తల్లిదండ్రులకు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ప్రతి మండలంలో ప్రత్యేక అధికారులు ఈ కార్యక్రమాన్ని సమీక్షించనున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో హాజరుకానున్నారని తెలిపారు. తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు అందరూ ఈ మెగా పిటియంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# బాధితురాలికి మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం



మనగళం, నంద్యాల : కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పెద్దక్క ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాలిపోయింది. కూలి డబ్బులు, నిత్యావసర సరుకులు, గృహపకరాలు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి బాధితురాలని కలిసి పరామర్శించారు. బాధితురాలికి రూ. 10 వేలు అందజేశారు. సూపర్ మార్కెట్ ద్వారా నిత్యావసర సరుకులు అందించి బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రభుత్వం వెంటనే స్పందించి అండగా ఉండాలని కోరారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి బాధితులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు విజయేశ్వర్ రెడ్డి, జయ ప్రకాష్ రెడ్డి (జేపీ), మాజీ కౌన్సిలర్లు జాకీర్, కిరణ్, అనిల్ అమృతరాజ్, సోహెల్ రాణా, వార్డ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు

– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల: జిల్లాలో స్పష్టమైన, సక్రమమైన ఓటర్ల జాబితా రూపొందించడానికి సమగ్ర చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌కు వివరించారు. విజయవాడలోని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎలక్టోరల్ రోల్స్, ఓటర్ మ్యాపింగ్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్%-%2026 సంబంధిత సన్నాహక పనులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష జరిగింది. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ తో పాటు డీఆర్ఓ రాము నాయక్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితాకు సంబంధించిన ఏ దరఖాస్తులూ పెండింగ్‌లో లేవని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల రేషనలైజేషన్ ప్రతిపాదనలను ఇప్పటికే పంపించినట్లు, వాటికి సంబంధించిన బిఎల్ఓ వివరాలన్నీ సమర్పించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి బిఎల్ఓ ఖాళీలూ లేవని, ఎన్నికల ఖర్చుల నివేదికను కూడా సీఈఓ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల పనితీరు మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. రేషనలైజేషన్ అనంతరం ఏర్పాటైన కొత్త పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బిఎల్ఓల జాబితాను కూడా పబ్లిష్ చేసినట్లు తెలిపారు. తద్వారా, ఖచ్చితమైన ఓటర్ల జాబితా, పారదర్శకతను మరింత బలోపేతం చేసేందుకు జిల్లా పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో స్వచ్ఛమైన, తప్పులులేని ఓటర్ జాబితా రూపొందించడానికి కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని, ముఖ్యంగా సిమిలర్ ఫొటోలు, మరో ప్రాంతానికి మారినవారి పేర్లు, మరణించిన వారి పేర్లు, ఒకే ఇంటి నంబర్‌పై అధిక సంఖ్యలో ఓట్లు, ఒకే వ్యక్తి పేరుతో అధిక ఓట్లు వంటి లోపాలను పూర్తిగా తొలగించాల్సిందిగా ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై ఈ సందర్భంగా సీఈఓ కూలంకుషంగా చర్చించారు.

# నేడు డీఫ్ అకౌంట్స్ యాక్టివేషన్ శిబిరం

– ఖాతాదారుల డబ్బు, హక్కులను నిర్ధారించేందుకు ప్రత్యేక కార్యక్రమం
– లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్

మనగళం, నంద్యాల: భారత ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపట్టిన "మీ డబ్బు%-%మీ హక్కు" (ఆపకీ పూజాజీ, ఆపకా అధికార్) జాతీయ ప్రచార భాగంగా నంద్యాల జిల్లాలో నవంబర్ 28న కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ఒక రోజు డీఫ్ అకౌంట్స్ యాక్టివేషన్ క్యాంప్ నిర్వహించనున్నట్టు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం, ఆర్బీఐ, సెబీ, ఐఆర్డీఏఐ, ఐఈపీఎఫ్ఏ వంటి ప్రముఖ నియంత్రణ సంస్థల సంయుక్త సమన్వయంతో దేశవ్యాప్తంగా నిర్వహించబడుతోందన్నారు. బ్యాంకుల్లో 10 సంవత్సరాల పాటు ఉపయోగంలో లేని ఖాతాలను క్లెయిమ్ చేయని ఖాతాలుగా పరిగణించి వాటిలోని మొత్తాన్ని ఆర్బీఐ నిర్వహించే డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ (డీఫ్) కు బదిలీచేస్తాయని ఎల్డీఎం తెలిపారు. ఈ మొత్తాన్ని తిరిగి పొందేందుకు ఖాతాదారులు లేదా హక్కుదారులు సంబంధిత బ్యాంకుకు దరఖాస్తుతో పాటు కేవైసీ పత్రాలు సమర్పించడం ద్వారా తమ హక్కును పొందవచ్చని వివరించారు. నవంబర్ 28న జరిగే జిల్లా స్థాయి శిబిరంలో బ్యాంకులు ప్రజలకు డీఫ్ ఖాతాల వివరాలు, క్లెయిమ్ చేసే విధానం, అవసరమైన పత్రాలు వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించనున్నాయని ఆయన తెలిపారు. జిల్లాలో ఈ శిబిరం విజయవంతం కావడానికి బ్యాంకులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులందరూ హాజరై సహకరించాలని రవీంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు.

# చంద్రబాబూ..ఇకనైనా మీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోండి



మన గళం గూడూరు: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని, ప్రజల స్పందన చూసైనా ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కుడా మాజీ చైర్మన్ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి వైఎస్ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ సూచించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా గూడురు మున్సిపాలిటీలో సంతకాలు పూర్తి చేసి పత్రాలు కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి మరియు కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు, ప్రజలకు హర్షవర్ధన్ రెడ్డి,సతీష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపుతో చేపట్టిన ఏ కార్యక్రమమైనా కోడుమూరు నియోజకవర్గంలో ఘనవిజయం సాధిస్తుందని, ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సమన్వయంతో చేపట్టామన్నారు. ప్రజలు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటు చేతుల్లోకి వెళితే పేద విద్యార్థులకు మెడికల్ విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు . అందుకే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిరసన తెలుపుతున్నారని ఆయన తెలిపారు. గ్రామ, మండల నాయకులు రోజూ కష్టపడి పనిచేయడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలిగామన్నారు. ప్రభుత్వం చేసే తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలకపాత్ర పోషించారని వారు ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో గూడూరు వైస్ చైర్మన్ కర్నూలు జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షులు అస్లాం, వైస్ చైర్మన్ లక్ష్మన్న, కో ఆప్షన్ నెంబర్ మదర్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ హబీబ్, రవి ప్రతాప్, పత్తి రంగడు, కొండగేరి గిడ్డయ్య, శివ, మధు, పుట్టే పాశం గిరి, పెద్ద గిడ్డయ్య, ముజీబ్, రషీద్, సుధాకర్, బొంబాయి వీరేష్, సింగనగేరి శీను, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదోని జిల్లా చేసేంతవరకు పోరాటం ఆగదు



మనగళం, ఆదోని : ఆదోనిని జిల్లా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదోని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు విద్యార్థి సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, గణేషు, బతకన్న, రఘు, అఫ్రిద్ మాట్లాడుతూ కరువు వలసలు ఆగాలంటే ఆదోనిని జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆదోని డివిజన్ లో ప్రజలకు విద్య వైద్యం వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించాలన్నా, ఇక్కడ విద్యార్థుల భవిష్యత్ బాగుండాలన్న ఆదోని జిల్లా చేసేంతవరకు పోరాడుతూనే ఉంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు స్పందించి ఆదోనిని జిల్లా చేయాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయబడతామని హెచ్చరించారు.

# అన్నదాత సుఖీభవ గురించి అవగాహన కల్పిస్తున్న మండల టిడిపి నాయకులు..



నందవరం నవంబర్ 27 మనగళం న్యూస్ : నందవరం మండల పరిధిలోనే నాగలదిన్నె గ్రామంలో ఎన్నికల్లో ఇచ్చి న మాట ప్రకారం రైత న్నలకు అన్నదాత సుఖీభవ డబ్బులు పథకం ఖాతాలో వేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ సీనియర్ నాయకులు భాస్కర్ల చంద్ర శేఖర్, మండల అధ్యక్షులు కాశీంవలి, సొసైటీ చైర్మన్ గోపాల్ నాగలదిన్నె టిడిపి సీనియర్ నాయకులు అన్నారు. గురువారం నాగలదిన్నె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో మాట ఇచ్చారని, రెండు విడుతల్లో రూ.7 వేలు చొప్పున అందించారని, మరో విడత%ఎ%డబ్బులను జనవరిలో రైతన్నల ఖాతాలో వేస్తారని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అందించే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల గురించి రైతులకు వివరించారు. టీడీపీ నాయకులు సత్య రెడ్డి, బంగారి మరియు గ్రామ టిడిపి నాయకులు రైతులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (27.11.2025) ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు.వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

## సాంస్కృతిక కార్యక్రమాలు



మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (26.11.2025) శ్రీ సీతారామ భజన సమాజం, పాతకొట్టం గ్రామం, కాకినాడ బృందం వారిచే శివస్తుతి భజన కార్యక్రమం నిర్వహించబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ భజన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గజవదన, ఓం నమశ్శివాయ, భో..శంభో, సదాశివ గంగాధర తదితర గీతాలకు ఎం.రాజు, వై.వరహాల బాబు, జె.రామకృష్ణ, యస్.నాగ సత్యవేణి, ఎన్.లక్ష్మీ, ఎం.విజయదుర్గ తదితరులు భజన పాటలు ఆలపించియున్నారు. రెండవ కార్యక్రమములో భాగంగా శ్రీ వరలక్ష్మీ కళ్యాణి మరియు వారి బృందం, తెనాలి వారిచే భక్తి సంగీత విభావరి కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గకార గణపతి స్తోత్రం, శివ స్తుతి, విశ్వనాథఅష్టకం, ఓం నమశ్శివాయ, భో..శంభో, మహాదేవశంభో తదితర గీతాలను వరలక్ష్మీ కళ్యాణి ఆలపించనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## సాంస్కృతిక కార్యక్రమాలు





మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (27.11.2025) శ్రీసాయి నాట్యకళాశాల, నందికొట్కూరు, నంద్యాల బృందం వారిచే కూచిపూడి నృత్య కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ కూచిపూడి నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గజవదన, ఓం నమశ్శివాయ, భో..శంభో, సదాశివ గంగాధర తదితర గీతాలకు తులసి, లక్ష్మీ, ధనుశ్రీ, హన్షిక, సర్వజ్ఞ తదితరులు నాట్యం చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## ఫేక్ వెబ్సైట్ క్రియేట్ చేసి భక్తులను మోసం

**– దర్యాప్తు చేస్తున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. ప్రసాదరావు**



మనగళం శ్రీశైలం : శ్రీశైల నందు గల ఏపీ టూరిజం హోటల్ పేరు మీద ఫేక్ వెబ్సైట్ క్రియేట్ చేసి భక్తులను మోసం చేసినందుకు ఏపీ టూరిజం మేనేజర్ పవన్ గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీశైలం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.ప్రసాద్ రావు బుధవారం నాడు తెలిపారు.

## ‘ఎక్స్’ ప్రీమియం సేవలు కేవలం రూ.89కే



హైదరాబాద్, నవంబర్ 27,మనగళం : సోషల్ మీడియా దిగ్గజం ఎలాన్ మస్క్కు చెందిన ‘ఎక్స్’ ప్లాట్ఫామ్ యూజర్లకు అదిరిపోయే బంపర్ ఆఫర్ను ప్రకటించింది. ఇప్పటివరకు ఖరీదుగా భావించిన ప్రీమియం సబ్స్క్రిప్షన్ను ఇప్పుడు కేవలం రూ.89కే అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనివల్ల సాధారణ యూజర్లు కూడా తక్కువ ఖర్చుతోనే అధునాతన ఫీచర్లను ఉపయోగించుకునే అవకాశం పొందుతున్నారు.

ఈ ప్రత్యేక ఆఫర్ డిసెంబర్ 2 వరకు మాత్రమే అమల్లో ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఆఫర్ ద్వారా యూజర్లు యాక్సెస్, బ్లూ టిక్ వెరిఫికేషన్, తక్కువ యాడ్స్, ఎక్కువ రీచ్, క్రియేటర్ మానిటైజేషన్ వంటి అనేక ప్రీమియం ఫీచర్లను పొందగలుగుతారు. సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేటర్లకు ఇది చాలా ఉపయోగకరంగా మారనుంది. ఇక ప్రీమియంం ప్లాన్ను రూ.890లకే పొందే అవకాశం కల్పించింది. అయితే ఈ ఆఫర్ కేవలం తొలి నెలకు మాత్రమే వర్తిస్తుంది. ఆ తర్వాత ధరలు మళ్లీ పెరుగుతాయి. ప్రీమియం ప్లాన్ ధర రూ.427గా, ప్రీమియంం ప్లాన్ ?2,570గా మారనుంది. అయినప్పటికీ ఈ తాత్కాలిక ఆఫర్ ద్వారా లక్షలాది మంది యూజర్లు తక్కువ ఖర్చుతోనే ప్రీమియం అనుభవాన్ని పొందే పరిస్థితి ఏర్పడింది. ఎక్స్ సంస్థ ఈ నిర్ణయం ద్వారా మరింత మంది వినియోగదారులను ప్రీమియం సేవల వైపు ఆకర్షించాలనే వ్యూహంతో ముందుకు వెళ్తోంది. ముఖ్యంగా భారత మార్కెట్లో యూజర్లు ఎక్కువగా ఉండటంతో, ఇక్కడ తన చందాదారుల సంఖ్యను గణనీయంగా పెంచుకోవాలని మస్క్ భావిస్తున్నట్లు టెక్ నిపుణులు చెబుతున్నారు. తక్కువ ధరకు ఇంతటి ఫీచర్లు అందడంతో ఈ ఆఫర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్గా మారింది.

## ఇండిగో బ్లాక్ ఫ్రైడే బంపర్ ఆఫర్..



హైదరాబాద్, నవంబర్ 27, మనగళం : దేశీయ-అంతర్జాతీయ విమాన ప్రయాణికులకు ఇండిగో భారీ కాస్త ఊరటనిచ్చింది. బ్లాక్ ఫ్రైడే ప్రత్యేక సేల్ పేరుతో టికెట్లపై భారీ రాయితీలు ప్రకటించింది. ఈ ఆఫర్లో టికెట్లు బుక్ చేసుకుంటే 2026 జనవరి 7 నుంచి జూన్ 30 వరకు ఏ తేదీనైనా ప్రయాణించవచ్చని తెలిపింది. దేశీయ విమానాలకు వన్వే టికెట్ ధర రూ.1,799 నుంచే ప్రారంభమవుతుండగా, అంతర్జాతీయ రూట్లకు రూ.5,999 నుంచే లభించనున్నట్లు వెల్లడించింది. నవంబర్ 25 నుంచి నవంబర్ 28 అర్ధరాత్రి వరకు మాత్రమే ఈ ప్రత్యేక సేల్ కొనసాగుతుంది. సంక్రాంతి, ఉగాది, శ్రీరామ నవమి వంటి పండుగలు, వేసవి సెలవుల సమయంలో ప్రయాణం ప్లాన్ చేసుకునేవారికి ఇది మంచి అవకాశం అని కంపెనీ పేర్కొంది. డెల్హీ%-%గ్వాలియర్, హుబ్బళ్లి%-%ముంబై, సూరత్%-%గోవా, బెంగళూరు%-%కర్నూలు, షిర్డీ%-%హైదరాబాద్ వంటి ప్రధాన దేశీయ మార్గాలపై ఈ తక్కువ ధరలు అందుబాటులో ఉన్నాయి. అంతర్జాతీయంగా చెన్నై%-%ఢాకా, చెన్నై%-%కొలంబో, చెన్నై%-%సింగపూర్, ముంబై%-%కాఠ్మండు, కొచ్చి%-%మాల్దీవ్స్, అబుదాబీ%-%కొచ్చి/మంగళూరు వంటి మార్గాలపై కూడా డిస్కౌంట్ ధరలు అమలు చేస్తున్నారు. ఈ సేల్లో భాగంగా ఫాస్ట్ ఫార్వర్డ్ ప్రాధాన్య సేవలపై 70 శాతం వరకు తగ్గింపు, ప్రీ-బుక్ మీల్స్పై 10 శాతం తగ్గింపు కూడా ఇస్తున్నారు. అయితే ఇది ఇండిగో నేరుగా నిర్వహించే ఫ్లైట్లకే వర్తిస్తుంది. సీట్లు పరిమితంగా ఉండటంతో ముందుగా బుక్ చేసుకున్నవారికే అవకాశం లభిస్తుంది. గ్రూప్ బుకింగ్స్కు ఈ ఆఫర్ వర్తించదని ఇండిగో స్పష్టం చేసింది. వివరాలకు కంపెనీ అధికారిక వెబ్సైట్ను సందర్శించాలని ప్రయాణికులకు సూచించింది.

## బీఎస్ఎన్ఎల్ నుంచి కొత్త వాయిస్ ఓవర్ వైఫై..




న్యూఢిల్లీ, నవంబర్ 27,మనగళం : ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరో కీలక సేవ అందించేందుకు అడుగులు వేస్తోంది. వాయిస్ ఓవర్ వైఫై సాంకేతికతను పైలట్ ప్రాతిపదికన రెండు జోన్లలో ప్రారంభించినట్లు సంస్థ అధికారులు వెల్లడించారు. ఇండోర్ వంటి ప్రాంతాలు, మొబైల్ నెట్వర్క్ బలహీనంగా ఉండే ప్రాంతాల్లో ఈ పరీక్షలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. తుది అనుమతి వచ్చిన వెంటనే దేశవ్యాప్తంగా ఈ సేవను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు.

ఈ సాంకేతికత ద్వారా మొబైల్ నెట్వర్క్ సిగ్నల్ లేని ప్రదేశాల్లో కూడా వైఫై కనెక్షన్ సహాయంతో ఫోన్ కాల్స్ చేసుకోవచ్చు. ఇంట్లో ఉన్న వైఫై లేదా ఇతర వైఫై నెట్వర్క్కు మొబైల్ను కలిపి, ఇంటర్నెట్ ఆధారంగా వాయిస్ కాల్స్ చేసే అవకాశం లభిస్తుంది. బీఎస్ఎన్ఎల్ నాలుగో తరం సిమ్ ఉన్న వినియోగదారులకు ఈ సేవ అందుబాటులో ఉండనుంది. అయితే బీఎస్ఎన్ఎల్ కస్టమర్గా ఉండటం తప్పనిసరిగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ విధానం ఆల్ప శబ్దం, స్పష్టమైన వాయిస్ నాణ్యతతో కాల్స్ చేసేలా రూపొందించారు. భూగర్భ ప్రాంతాలు, ఎత్తైన భవనాల్లో, దూర గ్రామాల్లో మొబైల్ టవర్ పరిధి తక్కువగా ఉండే ప్రదేశాల్లో నివసించే వారికి ఈ సాంకేతికత ఎంతో ఉపయోగపడనుంది. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ టెలికాం సంస్థలు ఈ సేవలు అందిస్తుండగా, ఇప్పుడు బీఎస్ఎన్ఎల్ కూడా అదే బాటలో ముందుకు రావడంతో ప్రభుత్వ రంగ సంస్థకు కొత్త బలం చేకూరుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఇదేతొ పాటు మహిళలు, విద్యార్థుల కోసం ప్రత్యేక రీచార్జ్ ప్రణాళికలను కూడా తీసుకురావాలని బీఎస్ఎన్ఎల్ యోచిస్తున్నట్లు సంస్థ చైర్మన్ తెలిపారు. తక్కువ ధరల్లో ఎక్కువ మాట్లాడే సమయం, ఎక్కువ చెల్లుబాటు గడువు కలిగిన ప్లాన్లను అందించే దిశగా కసరత్తు కొనసాగుతోందని చెప్పారు. ఇటీవల ప్రయోగాత్మకంగా ఒక రూపాయితో నాలుగో తరం సేవలను పరీక్షించే ప్రత్యేక ప్రణాళికను కూడా ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు.

## మహీంద్రా నుంచి కొత్త రూపంలో

ముంబై, నవంబర్ 27, ,మనగళం : దేశంలో విద్యుత్ వాహనాల విభాగంలో ముందంజలో ఉన్న మహీంద్రా సంస్థ మరో కొత్త మోడల్తో మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఏడుసీటర్ల సామర్థ్యంతో రూపొందించిన ఈ కొత్త ఎస్యూవీ వాహనం ఆధునిక రూపం, సాంకేతిక ఫీచర్లతో వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. వచ్చే నెల నుంచి పరీక్షా డ్రైవ్లకు అవకాశం కల్పించనుండగా, కొత్త సంవత్సరం జనవరి పద్నాలుగో తేదీ నుంచి బుకింగ్స్ ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. జనవరి ఇరవైమూడో తేదీ నుంచి వాహనాల డెలివరీలు మొదలవుతాయని తెలిపింది.

ఇది మహీంద్రా నుంచి వచ్చిన తొలి విద్యుత్ ఏడుసీటర్ల ఎస్యూవీగా ప్రత్యేకత సంతరించుకుంది. గతంలో విడుదల చేసిన ఇతర విద్యుత్ వాహనాలకు కొనసాగింపుగా ఇది మూడో మోడల్గా నిలుస్తోంది. విద్యుత్ వాహనాలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటంతో పాటు ప్రోత్సాహకాలు, సదుపాయాలు అందించడంతో మార్కెట్లో డిమాండ్ పెరుగుతోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మహీంద్రా ఈ కొత్త మోడల్ను ప్రవేశపెట్టింది.

ఈ వాహనంలో మూడు రకాల బ్యాటరీ సామర్థ్యాలు అందుబాటులో ఉన్నాయి. అవి యాభై తొమ్మిది కిలోవాట్ గంటలు, డెబ్బై కిలోవాట్ గంటలు, డెబ్బై తొమ్మిది కిలోవాట్ గంటలు సామర్థ్యం కలిగిన బ్యాటరీలు. వాహన ముందుభాగంలో ప్రత్యేకంగా మూసివేసిన గ్రిల్, ఎల్ ఆకారంలో డే టైం రన్నింగ్ లైట్లు, ప్రొజెక్టర్ దీపాలు, వెనుక భాగంలో దీపాల బార్ ఏర్పాటు చేశారు. తలుపులకు ఫ్లష్ విధానంలో అమర్చిన హ్యాండిళ్లు, గాలికి అనుగుణంగా రూపకల్పన చేసిన చక్రాలు, పైభాగంలో రూఫ్ రైల్స్ ఆకర్షణగా ఉన్నాయి.

లోపల భాగంలో పెద్ద స్క్రీన్ ఆధారిత డాష్బోర్డ్ అమరిక, విశాలమైన పనోరమిక్ సన్రూఫ్, ఉత్తమ నాణ్యత గల ధ్వని వ్యవస్థ, విద్యుత్తో పనిచేసే వెనుక తలుపు, యాంబియంట్ లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించారు. భద్రత విషయంలో కూడా కంపెనీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. వాహనానికి అత్యాధునిక డ్రైవర్ సహాయక వ్యవస్థ, ప్రమాద నివారణ కోసం బుద్ధిమంతమైన అత్యవసర బ్రేకింగ్ వ్యవస్థ, అంధ కోణం పర్యవేక్షణ, వైర్తో నియంత్రిత బ్రేకింగ్ సాంకేతికత, ప్రత్యక్ష వాహన భద్రతా పర్యవేక్షణ వ్యవస్థ అందిస్తున్నారు. మూడు ఎయిర్బ్యాగ్లతో కూడిన భద్రతా వ్యవస్థను కూడా ఇందులో పొందుపర్చారు.

# వాల్మీకుల ఎస్టి అంశంపై పార్లమెంటులో ప్రస్తావన చేయండి.

**– బివిఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారెళ్ల అంజి.**



( ఆలూరు మనగళం ): బోయ వాల్మీకి సమితి బిబిఎస్ సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ కర్నూలు జిల్లా ఇన్చార్జి యోగేష్ కు వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ అంశంపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం బోయ వాల్మీకి సమితి బివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మారెళ్ళ అంజి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 2018లో మడకశిరలో మరియు 2023 జోడో యాత్ర సందర్భంగా కర్నూలు జిల్లాకు వచ్చినప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వాల్మీకుల ఎస్టి పునర్దన చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాలేదు కానీ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదాలో ఉన్నారు. పార్లమెంటులో వాల్మీకి అంశాల పైన ప్రస్తావన లేవనేత్తాలి అని కోరారు. మా వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునర్ధన అంశం పైన సభలలో, యాత్రల సందర్భంగా మరియు ఎన్నికలు సమీపం వచ్చినప్పుడు మాత్రమే కాంగ్రెస్ పార్టీ మాట్లాడడం జరుగుతుంది. అధికారంలో లేకపోయినా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదాలో ఉన్నారు. కాబట్టి మా వాల్మీకిల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ అంశం పైన పార్లమెంటులోనా ప్రస్తావన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బివీఎస్ పత్తికొండ డివిజన్ అధ్యక్షులు మహేందర్ నాయుడు, దూదికొండ ఏవి నాయుడు, పెద్దపూల్తి తాయన్న, ఎద్దులదొడ్డి, తుగ్గలి హనుమంతు తదితరులు పాల్గొన్నారు

# జ్ఞాన స్వరూపిణి సరస్వతి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం.

**– పూర్వ విద్యార్థిని ధనలక్ష్మి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆలయం నిర్మాణం.**








( ఆలూరు మనగళం ): కర్నూలు జిల్లా, ఆలూరు మండల కేంద్రంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2002 నుండి 2003 విద్యా సంవత్సరం, పూర్వ విద్యార్థిని కె.తులసి తాను చదివిన పాఠశాలలో ఈశ్వర అనుగ్రహంతో మరియు తల్లిదండ్రులు కీ, శే, కరిగొంద గోవిందప్ప వారి ధర్మపత్ని కీ, శే, కరిగొంద జయమ్మ వారి జ్ఞాపకార్థంగా పాఠశాలలో సరస్వతి దేవి ఆలయం నిర్మించి, సరస్వతి దేవి నూతన విగ్రహం ప్రతిష్టించడం జరిగినది. అనంతరం దేవి వారికి పంచామృతాభిషేకం యజ్ఞ హోమాలు నిర్వహించారు. సరస్వతి దేవి కు ప్రత్యేక అలంకరణతో పూజలు చేశారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా స్కూల్ విద్యార్థులకు, గత పది సంవత్సరాలుగా, తమ వంతు సహాయంగా పాఠ్యపుస్తకాలను మరియు బుక్కులు పెన్సిల్, పెన్నులు అలాగే విద్యార్థులు రాసుకోవడని పలకాలు ప్రధానం చేయడం జరిగింది. సరస్వతి దేవి విగ్రహా ప్రతిష్ట మహోత్సవం పురస్కరించుకొని, పక్కన ఉన్న ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు ఒకటవ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పలకాలు అందజేయడం జరిగింది. అనంతరం హులేబీడు గ్రామంలో వ్యవసాయ కుటంబానికి చెందిన ఈరమ్మ, నరసప్ప దంపతుల కుమార్తె బీటెక్ విద్యార్థి నిఖిత కు జయశ్రీ టెక్నాలజీస్, హైదరాబాద్ వారి సౌజన్యంతో డెల్ లాప్టాప్ ప్రధానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతు ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయడం, సమాజ శ్రేయస్సు కోసం పనిచేయడం, మా లాంటి వారు ధనలక్ష్మి కుటుంబం సభ్యులను చిరకాలం గుర్థించ్చుకుంటాం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కీ, శే, కరిగొంద గోవిందప్ప వారి ధర్మపత్ని కీ, శే, కరిగొంద జయమ్మ వారి కుటుంబ సభ్యులు, కె.తులసి, కె. ధనలక్ష్మి, అల్లుడు తెలుగు టీచర్ భీమప్ప, కుమారుడు బసప్ప, కోడలు శివమ్మ, మనవళ్లు జయశ్రీ వర్ధన్, మోక్షశ్రీ వరుణ్, లోహిత్, మనవరాలు పరీక్షిని మరియు బంధుమిత్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంభం సుజాత మేడం, వేణుగోపాల్, మల్లికార్జున సురేష్, శారద మేడం, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పెర్త్ వేదికగా జరిగిన యాషెస్ తొలి టెస్టుకు గ్రీన్ సిగ్నల్..




పెర్త్, నవంబర్ 27, మనగళం : ఆస్ట్రేలియా – ఇంగ్లండ్ మధ్య యాషెస్ సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి టెస్టు మ్యాచ్ పెర్త్ మైదానంలో రెండు రోజుల్లోనే ముగియడం ప్రపంచ క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. తొలి రోజు నుంచే బంతి అసాధారణంగా ప్రవర్తించడంతో బ్యాట్స్‌మెన్ నిలబడలేకపోయారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 172 పరుగులకే ఆలౌటవ్వగా, ఆస్ట్రేలియా కూడా 132 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 164 పరుగులు మాత్రమే చేయగలిగింది. 204 పరుగుల లక్ష్యాన్ని చేధించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా రెండు వికెట్లు కోల్పోయి సులువుగానే లక్ష్యాన్ని అందుకుని ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలి రోజే మొత్తం 19 వికెట్లు పడిపోవడం రికార్డుగా నమోదైంది. దీంతో పెర్త్ పిచ్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అయితే తాజాగా అంతర్జాతీయ క్రికెట్ మండలి ఈ పిచ్‌పై తన నిర్ణయాన్ని ప్రకటించింది. అందరి అంచనాలకు భిన్నంగా ఈ పిచ్‌కు ‘అత్యంత మంచి’ అనే అత్యున్నత రేటింగ్ ఇచ్చింది. బౌలింగ్, బ్యాటింగ్ రెండింటికీ సమతుల్యం కనిపించిందన్న కారణాన్ని ఐసీసీ తన నిర్ణయంలో ప్రస్తావించింది. పిచ్ తీవ్రంగా సహకరించినా బ్యాట్స్‌మెన్ సాంకేతిక లోపాల వల్లే ఎక్కువ వికెట్లు పడిపోయాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనికి పూర్తి వ్యతిరేకంగా భారత్ %–% దక్షిణాఫ్రికా మధ్య కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన టెస్టు మూడు రోజుల్లో ముగియగా, ఆ పిచ్‌పై మాత్రం ఇంకా అధికారిక రేటింగ్ వెల్లడి కాలేదు. ఆ మ్యాచ్‌లో స్పిన్ బౌలింగ్ ఆధిక్యం ఎక్కువగా ఉండటంపై చర్చ కొనసాగుతోంది. మొత్తంగా పెర్త్ పిచ్‌కు ఇచ్చిన ‘అత్యంత మంచి’ గుర్తింపు క్రికెట్ వర్గాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రెండు రోజుల్లో మ్యాచ్ ముగిసినా, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా జరిగిందని ఐసీసీ తేల్చడం విశేషంగా మారింది.

# విద్యతోపాటు క్రీడా స్ఫూర్తి అవసరమే

కర్నూలు, నవంబర్ 27, మనగళం : విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థి జీవితంలో అంతే కీలకమైన భాగమని క్రీడా నిపుణులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. శారీరక దృఢత్వం, మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలు క్రీడల ద్వారా మరింత బలపడతాయని వారు చెబుతున్నారు. పురాతన కాలం నుంచే చదువుతో పాటు ఆటలు కొనసాగుతూ వస్తున్నప్పటికీ, ఇప్పటికీ కొందరిలో ఆటల్లో పాల్గొంటే చదువు దెబ్బతింటుందనే అపోహలు కొనసాగుతుండటం ఆందోళనకరం గా మారింది.

నిజానికి చదువుతో పాటు ఆటల్లో పాల్గొన్న అనేక మంది దేశానికి జాతీయ, అంతర్జాతీయస్థాయిల్లో కీర్తి తీసుకొచ్చిన ఉదాహరణలు కోకొల్లలు. ప్రతిభ గల క్రీడాకారులకు ప్రభుత్వాలు ప్రత్యేక శిక్షణతో పాటు గౌరవ పురస్కారాలు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సాహం అందిస్తున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు, రైల్వేలు, రక్షణ దళాలు, పోలీసు శాఖ, బ్యాంకింగ్ రంగం లాంటి వాటిలో క్రీడాకారులకు ప్రత్యేక కోటా ద్వారా ఉద్యోగాలు ఇస్తుండటం దీనికి జాతీయ స్థాయిలో క్రీడల అభివృద్ధికి క్రీడా ప్రాధికార సంస్థలు విస్తృతంగా పనిచేస్తున్నాయి. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు వంటి అంతర్జాతీయ పోటీలకు ఆటగాళ్లను సిద్ధం చేయడం, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రత్యేక క్రీడా పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు, క్రీడా మైదానాల అభివృద్ధి జరుగుతోంది.

# మొలగవల్లిలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

**– ప్రథమ విజేతలుగా నిలిచిన, ఎంఎస్ యూత్ టీం.**





( ఆలూరు మనగళం ): కర్నూలు జిల్లా, అలూరు మండలం, మొలగవల్లి గ్రామంలో బుధవారం రోజున శ్రీ చెన్నకేశవ స్వామి రథోత్సవ సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు బంగారు సునంద పటేల్ యాదవ్ (మొలగవల్లి ఎంపిటిసి) గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలులో ప్రథమ విజేతలుగా నిలిచిన ఎంఎస్ యూత్ టీం, ఆటగాళ్లుకు బహుమతి 30000/రూ ఇచ్చిన దాతలు గోపీని రామ్ మోహన్, కంది భాస్కర్, కటికె ప్రసాద్, కటికె స్వామి రావు ఇచ్చారు. ద్వితీయ బహుమతి 20000/రూ ఇచ్చిన దాతలు బంగారి నాగరాజు, బెంగళూరు శివ, మరియు తృతీయ బహుమతి 10000/రూ ఇచ్చిన బంగారి వెంకటేష్ మనవళ్ళు, బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్ లకు బహుమతి 2000/రూ ఇచ్చిన వారు చెన్నంపల్లి తిమ్మప్ప సన్స్ మరియు ఈ టోర్నమెంట్ అద్భుతంగా నిర్వహించిన బంగారు సునంద పటేల్ యాదవ్ , బంగారి రాజశేఖర్ , బంగారి ప్రసాద్, మరియు గ్రామ ప్రజల సహకారంతో టోర్నమెంట్ అద్భుతంగా నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమలో మొలగవల్లి ఎంపీటీసీ బంగారు సునంద పటేల్ యాదవ్, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# డబ్ల్యూపీఎల్ 2026కు జనవరి 9 నుంచి లాంచ్..

ముంబై, నవంబర్ 27, మనగళం : మహిళల ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ ఉద్వేగాన్ని మునుపెన్నడూ లేని స్థాయిలో తీసుకువస్తోంది. 2026 వార్షిక ఎడిషన్‌గా నిర్వహించనున్న ఈ మెగా టోర్నీ జనవరి 9 నుంచి ప్రారంభం కానుందని భారత క్రికెట్ నియంత్రణ మండలి అధికారికంగా ప్రకటించింది. ఫిబ్రవరి 5 వరకు పోటీలు కొనసాగనున్నాయని స్పష్టం చేసింది. ఈసారి మ్యాచ్‌లు నవీముంబై, వడోదర నగరాల్లో జరగనున్నట్లు తెలిపింది. పూర్తి షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని బోర్డు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే వేలం ప్రక్రియలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పలువురు స్టార్ క్రికెటర్లు జట్లలో చోటు దక్కించుకున్నారు. అయితే ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీ అన్‌సోల్డ్‌గా మిగిలిపోవడం ఆసక్తికరంగా మారింది. ఆరు సార్లు తన జట్టుకు మహిళల టీ20 ప్రపంచకప్‌ను అందించిన కెప్టెన్ అయిన హీలీ కనీస ధర యాభై లక్షలు ఉన్నప్పటికీ ఏ ఫ్రాంచైజీ కూడా ఆమెను కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడం చర్చకు దారి తీస్తోంది. వేలంలో దీప్తి శర్మను యూపీ వారియర్స్ మూడు కోట్ల ఇరవై లక్షలకు దక్కించుకోగా, సోఫీ డివైన్‌ను గుజరాత్ జెయింట్స్ రెండు కోట్లకు సొంతం చేసుకుంది. అమెలియా కెర్‌ను ముంబై జట్టు మూడు కోట్లకు కొనుగోలు చేసింది. రేణుకా సింగ్‌ను గుజరాత్ జెయింట్స్ అరవై లక్షలకు తీసుకోగా, సోఫీ ఎకిల్‌స్టోన్‌ను యూపీ వారియర్స్ ఎనభై ఐదు లక్షలకు రీటైన్ చేసుకుంది. అలాగే మెగ్ లానింగ్‌ను యూపీ వారియర్స్ ఒక కోటి తొంభై లక్షలకు, లారా వొల్వార్డ్‌ను దిల్లీ జట్టు ఒక కోటి పది లక్షలకు దక్కించుకుంది. ఈసారి డబ్ల్యూపీఎల్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దేశీయమైన మహిళా క్రికెట్ స్థాయిని మరింత ముందుకు తీసుకెళ్లే ఈ టోర్నీ, యువ క్రికెటర్లకు గొప్ప వేదికగా మారనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జనవరి 9 వచ్చేసరికి క్రికెట్ ప్రేమికుల్లో అసలైన పండగ వాతావరణం నెలకొననుందనే చెప్పాలి.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.